శుక్ర వారం
19-01-2024
సంపుటి - 09,
సంచిక - 434
పేజీలు - 4
వెల రూ. 5/-
Telangana
Andhra
Pradhesh
CEO & Editor : G. PRUDHVIRAJ
RNI NO: TELTEL/2016/73311
www.samasamajam.in
# సమ సమాజం
SAMA SAMAJAM TELUGU DAILY
జాతీయ తెలుగు వార్త పత్రిక
Published From Hyderabad Circulated by Hyderabad, Rangareddy, Nalgonda, Warangal, Medak, Karimnagar, Kammam, Vishakapatnam, Vijayawada, Ongole

# రైతులకు కార్పొరేట్ తరహాలో లాభాలు

## ఇదే తన స్వప్నమన్న సిఎం రేవంత్



- దావోస్ సదస్సులో మాట్లాడిని సిఎం
- టాటా గ్రూపుతో స్కిల్ సెంటర్లపై ఒప్పందం

**హైదరాబాద్, జనవరి 18 (సమ సమాజం):** రైతులకు కార్పొరేట్ తరహాలో లాభాలు రావాలన్నదే తన స్వప్నమని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. దావోస్‌లో జరిగిన వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ వార్షిక సమావేశంలో 'ఆహార వ్యవస్థలు, స్థానిక చర్యలు' సదస్సు జరిగింది. ఇందులో రేవంత్‌రెడ్డి పాల్గొని మాట్లాడారు. భారత్‌లో రైతుల ఆత్మహత్యలు అతిపెద్ద సమస్య అన్నారు. రైతులకు బ్యాంకు రుణాలు రావు, ఆధునిక టెక్నాలజీ లేదన్నారు. రైతులకు సరైన లాభాలు రావడం లేదని.. తెలంగాణలో మాది రైతు ప్రభుత్వమని చెప్పారు. రైతు భరోసా ద్వారా నేరుగా పెట్టుబడి సాయం అమలు చేస్తున్నామన్నారు. రైతులకు కార్పొరేట్ తరహా లాభాలు రావాలనేదే నా స్వప్నమని.. లాభాలు వస్తే రైతు ఆత్మహత్యలు 99శాతం ఉండడవన్నారు. వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చే విధానాలు అవసరమని, ఎంతో సాయం చేస్తున్న రైతులకు ప్రపంచం అండగా నిలవాలని పిలుపునిచ్చారు. వ్యవసాయాన్ని లాభదాయకంగా మార్చేందుకు స్థిరమైన మోడల్‌ను రూపొందించాల్సిన అవసరం ఉందని.. రైతులు ఎప్పుడూ ప్రపంచానికి సహాయం చేస్తూనే ఉన్నారని.. ఇప్పుడు ప్రపంచం రైతులకు అండగా నిలువాల్సిన సమయం ఆసన్నమైందని అన్నారు. ఇదిలావుంటే రాష్ట్రంలోని 50 ఐటీఐలలో అధునాతన సాంకేతిక నైపుణ్య శిక్షణ కేంద్రాల ఏర్పాటుకు టాటా గ్రూప్ కంపెనీ ఒప్పందం చేసుకుంది. వీటిలో కొత్త కోర్సులు, మాస్టర్ ట్రైనర్ల నియామకానికి రూ.1500 కోట్ల పెట్టబడులు పెట్టనుంది. దావోస్‌లో వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ వార్షిక సదస్సులో టాటా సన్స్ చైర్మన్ నటరాజన్ చంద్రశేఖరన్ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో సమావేశమయ్యారు. ఇప్పటికే వివిధ రంగాల్లోవిస్తరించిన టాటా గ్రూప్ తెలంగాణలో చేపట్టబోయే భవిష్యత్తు వ్యాపార ప్రణాళికలపై చర్చించారు. టీ రంగంలో టాటా కన్స్టలెన్సీ సర్వీసెస్ హైదరాబాద్ లోని అతి పెద్ద ఐటీ కంపెనీలలో ఒకటి. ఇందులో 80 వేల మందికి పైగా ఉద్యోగులున్నారు. రాబోయే కొన్నేళ్లలో టీసీఎస్ మరింత వృద్ధి చెందనుంది.

2వ పేజీలో...

# గజ్వేల్‌లో కెసిఆర్‌ను ఓడించేందుకు కుట్ర

- కాంగ్రెస్, బిజెపిలు పోటీపోటీగా కుట్రలు
- అయినా ప్రజలు కెసిఆర్ వెంటే నడిచారు
- గజ్వేల్ బిఆర్ఎస్ కృతజ్ఞతా సభలో హరీష్ రావు



3వ పేజీలో...

**గజ్వేల్, జనవరి 18 (సమ సమాజం):** మొన్నటి ఎన్నికల్లో గజ్వేల్‌లో కేసీఆర్‌ను ఓడించేందుకు రెండు జాతీయ పార్టీలు కూడబలుక్కుని పని చేశాయని సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. కులాలు, మతాలు చిచ్చు

---

# హంతకులే సంతాప సభ పెట్టినట్టుగా ఉంది

## కేటీఆర్‌పై మంత్రి పొన్నం ప్రభాకర్ ఘాటు వ్యాఖ్యలు



3వ పేజీలో...

**హైదరాబాద్, జనవరి 18 (సమ సమాజం):** హంతకులే సంతాప సభ పెట్టినట్టుగా ఉందంటూ కేటీఆర్‌పై మంత్రి పొన్నం ప్రభాకర్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. సర్పంచ్‌లను పనుల పేరుతో సస్పెన్షన్‌ల పేరుతో వేధించింది నిజం కాదా? అని నిలదీశారు. ఇప్పుడు మళ్లీ ఆత్మీయ సమ్మేళనలా పేరుతా రాజకీయాలకు తెరలేపితే మిమ్మల్ని ఎవరూ నమ్మరు కేటీఆర్ అంటూ వ్యాఖ్యానించారు. ఈ మేరకు సోషల్ మీడియా

---

# ఉచిత బస్ ప్రయాణం వివక్ష

## పిల్ దాఖలు చేసిన ఉద్యోగి



3వ పేజీలో...

**హైదరాబాద్, జనవరి 18 (సమ సమాజం):** తెలంగాణ ప్రభుత్వం మహాలక్ష్మి పథకంలో భాగంగా మహిళలు ఉచిత బస్సు ప్రయాణం సౌకర్యం కల్పించిన సంగతి తెలిసిందే. ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణంపై తెలంగాణ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. మహిళలకు మాత్రమే ఉచిత ప్రయాణ వసతి కల్పించడం వివక్ష కిందకే వస్తుందని నాగోల్‌కి చెందిన ప్రైవేట్ ఉద్యోగి పిటిషన్ వేశారు. కేంద్ర చట్టాల ద్వారా ఏర్పాటైన ఆర్టీసీలో ఉచిత

---

# వెయ్యిమంది బాలకృష్ణలు వచ్చినా ..

## జూనియర్ ఎన్టీఆర్‌ను ఏమీ చేయలేరు

## ఫ్లెక్సీల తొలగింపుపై కొడాలి నాని ఆగ్రహం



3వ పేజీలో...

**విజయవాడ, జనవరి 18 (ఆర్ఎన్ఎ):** వెయ్యి మంది బాలకృష్ణలు, చంద్రబాబులు వచ్చినా జూనియర్ ఎన్‌టిఆర్‌ను ఏమీ చేయలేరని వైసిపి ఎంఎల్ఎ కొడాలి నాని ధ్వజమెత్తారు. హైదరాబాద్‌లో ఎన్ టిఆర్ ఘాట్ వద్ద జూనియర్ ఎన్‌టిఆర్ ఫ్లెక్సీలు తొలగించాలని బాలకృష్ణ తన అనుచరులకు ఆదేశించడంతో మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు

# వింగ్స్ ఇండియా హైదరాబాద్‌కు గర్వకారణం

## అమెరికాకు నేరుగా విమానాలు నడపాలి

## జ్యోతిరాదిత్యకు మంత్రి కోమటిరెడ్డి వినతి



3వ పేజీలో...

**హైదరాబాద్, జనవరి 18 (సమ సమాజం):** వింగ్స్ ఇండియా కార్యక్రమానికి హైదరాబాద్ నగరం ఆతిథ్యం ఇస్తున్నందుకు సంతోషంగా ఉందని రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. 'వింగ్స్ ఇండియా' కార్యక్రమం ప్రారంభమవనున్న నేపథ్యంలో మంత్రి కోమటిరెడ్డి స్పందించారు. రాష్ట్రంలో ఎన్నో అవకాశాలు ఉన్నాయని, తెలంగాణ దేశంలోనే ఎంతో అభివృద్ధి చెందుతోంద న్నారు. హైదరాబాద్ నుంచి

# కోలుకుంటున్న తమ్మినేని

## ఆస్పత్రిలో పరామర్శించిన భట్టి



4వ పేజీలో...

**హైదరాబాద్, జనవరి 18 (సమ సమాజం):** హైదరాబాద్ ఏఐజి దవాఖానలో చికిత్స పొందుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రాన్ని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క గురువారం పరామర్శించారు. గుండెపోటుతో హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న తమ్మినేని ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. వీరభద్రం సంపూర్ణ ఆరోగ్యంతో త్వరగా కోలుకొని ప్రజా క్షేత్రంలోకి

# ఆరు నెల్లో కాంగ్రెస్‌పై ప్రజా తిరుగుబాటు


ఆదానీని దొంగ అంటూనే అలయ్ బలయ్ ● పార్లమెంట్ ఎన్నికలకు సన్నద్ధంగా ఉండాలి ● ఎమ్మెల్సీలకు కెటిఆర్ పిలుపు



3వ పేజీలో...

**హైదరాబాద్, జనవరి 18 (సమ సమాజం):** ఆరు నెలల్లో కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజలు తిరగబడతారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్ అన్నారు. ఎన్నికల ముందు అదానీ దొంగ అని విమర్శించిన రేవంత్ రెడ్డి.. సీఎం అయ్యాక దావోస్ సాక్షిగా అదానీతో అలయ్-బలయ్ చేసుకున్నారని విమర్శించారు. ప్రధాని మోదీ- అదానీ ఒకటేనని రాహుల్ అంటున్నారని.. మొన్న రేవంత్ కూడా అదానీ-మోదీ ఒకటేనని విమర్శించారని గుర్తు చేశారు. ఢిల్లీలో అదానీతో కొట్లాడుతూ తెలంగాణలో మాత్రం అదానీతో కలిసి ఎందుకు పనిచేస్తున్నారో చెప్పాలని రేవంత్ రెడ్డిని కేటీఆర్ డిమాండ్ చేశారు. ఈ ఏడాదిలో వరుసగా వివిధ ఎన్నికలు ఉన్నాయని.. వీటిని ఎదుర్కోవడం కోసం పార్టీ సంసిద్ధంగా ఉండాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. గురువారం పార్టీ ఎమ్మెల్సీలతో సమావేశం అయిన ఆయన.. రానున్న

# శ్రీరామ జన్మభూమి పై స్మారక పోస్టల్ స్టాంప్



2వ పేజీలో...

## విడుదల చేసిన ప్రధాని మోడీ

**న్యూఢిల్లీ, జనవరి 18 (సమ సమాజం):** రామ్‌లల్లా ప్రాణప్రతిష్ఠకు ముందుగా గురువారం శ్రీరామ జన్మభూమి ఆలయంపై స్మారక పోస్టల్ స్టాంప్‌ను ప్రధాని నరేంద్ర మోదీ విడుదల చేశారు. దీనితో పాటు రాముని చిత్రంతో కూడిన స్టాంపుల పుస్తకాన్ని కూడా ప్రధాని ప్రపంచవ్యాప్తంగా విడుదల చేశారు. ఈ 48 పేజీల పుస్తకంలో 20 దేశాల స్టాంపులు ఉన్నాయి. రామాలయ పోస్టల్ స్టాంపు విడుదల అనంతరం ప్రధాని మోదీ ఓ వీడియో సందేశాన్ని కూడా విడుదల చేశారు. ప్రధాని మోదీ మొత్తం 6 తపాలా స్టాంపులను విడుదల చేశారు. వీటిలో

---

# హైదరాబాద్‌లో ట్రాఫిక్ క్రమబద్దీకరణ

## మరింత కఠినంగా రూల్స్ అమలు

## అడ్డదిడ్డంగా పార్క్ చేస్తే అంతే సంగతలు



3వ పేజీలో...

**హైదరాబాద్, జనవరి 18 (సమ సమాజం):** నగర ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించే క్రమంలో హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు కొత్త రూల్స్ అమలు చేస్తున్నారు. పెరుగుతున్న రద్దీ దృష్ట్యా కఠిన నిబంధనలు తీసుకొస్తున్నారు. సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో మాల్స్, థియేటర్స్, వ్యాపార భవనాల వద్ద రోడ్ పై పార్క్ చేస్తున్న వాహనాలకు

---

# ఎమ్మెల్సీ ఎన్నికలకు ఇద్దరే నామినేషన్లు

## ఏకగ్రీవం అయ్యే ఛాన్స్



3వ పేజీలో...

**హైదరాబాద్, జనవరి 18 (సమ సమాజం):** తెలంగాణలో ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఉప ఎన్నికలకు నామినేషన్ల పర్వం ముగిసింది. రెండు స్థానాల కోసం ఇద్దరు కాంగ్రెస్ అభ్యర్థులునుంచి మాత్రమే నామినేషన్ దాఖలు చేశారు. ఇక, ఎవరూ నామినేషన్లు వేయకపోవడంతో బల్మూరి వెంకట్, మహేష్ కుమార్ గౌడ్ ఎన్నిక ఏకగ్రీవం కానుంది. ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఉప ఎన్నికలకు కాంగ్రెస్ అభ్యర్థులు

---

# 2028 కల్ల భారత్ స్పేస్ స్టేషన్

## ఇస్రో చైర్మన్ సోమనాథ్ వెల్లడి



**చండీగఢ్, జనవరి 18 (సమ సమాజం):** భారత్ సొంత అంతరిక్ష కేంద్రం ఏర్పాటుపై ఇస్రో చైర్మన్ సోమనాథ్ కీలక విషయం వెల్లడించారు. భారత స్పేస్ స్టేషన్ ప్రాథమిక వెర్షన్ 2028లో నింగిలోకి వెళుతుందని తెలిపారు. హర్యానాలోని ఫరీదాబాద్‌లో గురువారం జరిగిన ఇంటర్నేషనల్ సైన్స్ ఫెస్టివల్ కార్యక్రమం సందర్భంగా సోమనాథ్ మాట్లాడారు. 'భారత్ స్పేస్ స్టేషన్‌కు సంబంధించి వచ్చే ఏడాదికల్లా తొలి రౌండ్ పరీక్షలు నిర్వహిస్తాం. స్పేస్ స్టేషన్ బేసిక్ మోడల్‌ను 2028లో కక్ష్యలోకి పంపి 2035కల్లా దానికి పూర్తిస్థాయి రూపు తీసుకువస్తాం. స్పేస్ స్టేషన్ క్రూ కమాండ్ మాడ్యూల్, నివాస మాడ్యూల్, ప్రొపల్షన్ మాడ్యూల్, డాకింగ్ పోర్ట్ అనే విభాగాలు కలిగి

3వ పేజీలో...

# అహంకారం చావని బిఆర్ఎస్ నేతలు !

చింతచచ్చినా పులుపు చావలేదన్నది సామెత... ఇది సరిగ్గా బిఆర్ఎస్ నేతలకు వర్తిస్తుంది. అధికారం పోయినా అహంకారం చావలేదు. తెలంగాణను అడ్డంగా దోచుకుని అప్పులకుప్పగా చేసి..ఎన్నో హామీలు గుప్పించి.. గోబెల్స్ ప్రచారాలతో ప్రజలను వంచించిన నేతలు ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చీరాగానే విమర్శలకు దిగడం చూస్తుంటే వీరిని ఏమనాలో అర్థం కావడం లేదు. కాంగ్రెస్ ప్రభుత్వానికి ఇంకా వంద రోజులు కూడా కాలేదని ఆగుతున్నామని, లేకపోతే హామీల అమలుపై ప్రభుత్వాన్ని చీల్చి చెండాడే వాళ్లమని బిఆర్ఎస్ ఎంఎల్ఎ టి.హరీశ్‌రావు చేసిన వ్యాఖ్యలు ఆయన అహంకారానికి పరాకాష్టగా చూడాలి. అలాగే ఇంకా ప్రజలు కెసిఆర్‌నే సిఎంగా కోరుకుంటున్నారని..కెసిఆర్ సిఎంగా లేకపోవడంతో బాధపడు తున్నారని మరో ఎమ్మెల్యే కెటి రామారావు చేసిన వ్యాఖ్యలు కూడా అధికార అహంకారాన్ని సూచిస్తు న్నాయి. ఈ ఇద్దరు నేతలు గత కొన్ని రోజులుగా చేస్తున్న వ్యాఖ్యలు వారి అహంకారాన్ని పరాకాష్టకు చేర్చాయి. తెలంగాణ ప్రజలు చెమటోడ్చి, ప్రాణాలు అర్పించి తెచ్చిన తెలంగాణలో అధికారం అనుభవించి ఇప్పుడు నీతులు మాట్లాడుతున్న వారి అవినీతిని చీల్చి చెండాడాలి. చరిత్రలో మరోమారు ఇలా అధికారం అడ్డం పెట్టుకుని అవినీతికి పాల్పడాలంటే భయపడేలా చేయాలి. నిజానికి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరవాత తీసుకుంటున్న చర్యలను ప్రజలు స్వాగతిస్తున్నారు. ప్రజలు నిరంకుశ పాలన పీడవిరగడ అయ్యిందన్న భావనలో స్వేచ్ఛావాయువులు పీల్చుకుంటున్నారు. ముందుగా అనేక అక్రమాలకు బిఆర్ఎస్ నేతలు సమాధానం చెప్పాలి. అందులో ధరణి అక్రమాలు, మిషన్ భగీరథ దుర్వినియోగం, మిషన్ కాకతీయ దుర్వినియోగం వంటివి ఉన్నాయి. నిన్నిటికి నిన్న ఖాజాగూడలో అక్రమంగా విల్లాల కోసం ప్రభుత్వ భూముల్లో రోడ్డు వేయడం వంటివి వున్నాయి. ఇవికాక నయీం డైరీ, మియాపూర్ భూముల బాగోతం, 111 జీవో రద్దు, ప్రభుత్వ భూముల ఆక్రమ అమ్మకాలు, అక్రమ ఆక్రమణలు, సొంతపార్టీకి కోకాపేటలో భూముల కేటాయింపు, ప్రతి నియోజకవర్గంలో పార్టీ కార్యాలయాలకు భూ కేటాయింపులు వంటివన్నీ ఉన్నాయి. అన్నింటికి మించి భూములను అప్పనంగా అమ్మి తెలంగాణను అప్పుల ఊబిలోకి నెట్టారు. సకాలంలో జీతాలు ఇవ్వలేదు. తెలంగాణ పబ్లిక్ సర్వీస్‌ను భ్రష్టపట్టించారు. ఇంటర్ పరీక్షల పేపర్ల లీకేజీలతో విద్యార్థుల ఆత్మహత్యలకు కారణమయ్యారు. ఇలా చెప్పుకుంటూ పోతే అనేకానేక అధికార దుర్వినియోగాలు కోకొల్లలు. వీటికి సమాధానం రావాలి. అంతెందుకు జర్నలిస్టులకు భూ కేటాయింపులో సుప్రీం తీర్పును కాలరాచినందుకు నిలదీయవచ్చు. సుప్రీం తీర్పునే ఖాతరు చేయని వారు పాలకులు ఎలా అవుతారో చెప్పాలి. ఈ పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు మరింత అప్రమత్తం కావాలి. బిఆర్ఎస్ అక్రమాలను ఎక్కడికక్కడ నిలదీయాలి. ఈ సమస్యలపై ప్రశ్నలు సిద్ధం చేసుకుని నిలదీయాలి. ఎంపి ఎన్నికల్లో ఎందుకు ఓటేయాలో అడగాలి. ఎందుకు తెలంగాణను భ్రష్టు పట్టించారో అడగాలి. కొన్ని రోజులైతే బిఆర్ఎస్ నేతలు ఇంట్లో కూర్చున్నా, రండి రండని ప్రజలే బయటకు తీసుకువస్తారని హరీష్ రావు అనడం చూస్తుంటే ఆశ్చర్యం వేస్తుంది. ప్రజలు అంత వెర్రిబాగుల వారని అనుకుంటున్నారా ఏమో అని అనిపిస్తోంది. కర్నాటక లో ఐదు గ్యారంటీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం పరిస్థితి కుడితిలో పడ్డ ఎలుకలా మారిందని హరీష్ రావు విమర్శించడం అహంకారానికి పరాకాష్ట. అక్కడి సంగతి ఎందుకు ..ఇక్కడి తమ పదేళ్ల అవినీతిపై మాట్లాడితే మంచిది. శ్వేతపత్రాలపై మాట్లాడాలి. విద్యుత్ కొనుగోళ్ల అవినీతిపై మాట్లాడాలి. రైతుబంధు పేరుతో అప్పనంగా దోచిన సంగతిపై మాట్లాడాలి. కర్ణాటక ఆర్థిక వ్యవస్థ కుప్ప కూలుతుందని ఎవరో హెచ్చరించారని అంటున్న హరీష్ రావు..ఇక్కడ కుప్పకూలిన ఆర్థిక వ్యవస్థ గురించి

మాట్లాడాలి. మన దగ్గర కూడా కాంగ్రెస్ నేతలు గ్యారంటీల చావు వార్త చెప్పే రోజులు ఎంతో దూరంలో లేవని చెప్పడం ద్వారా తమ పార్టీ వారిలో భరోసా నింపవచ్చేమో కానీ ప్రజలను ఇకముందు ఎంతమాత్రం నమ్మించలేరని గుర్తించాలి. తెలంగాణ పేరుతో వంచించిన పాపం ఇంకా భరించాల్సిన అసవరం ప్రజలకు లేదు. ఇంతకాలం అధికారంలో ఉండి కాకమ్మ కథలు చెబుతూ వచ్చారు. పార్లమెంట్ ఎన్నికల్లో బిఆర్ఎస్ అభ్యర్థులను ఓడించడం ద్వారా ప్రజలు మరోమారు విజ్ఞత ప్రదర్శించాల్సిన సమయం వచ్చింది. తెలంగాణ సమస్యలకి పరిష్కారం కోసం బిఆర్ఎస్ నేతలను ఎక్కడికక్కడ నిలదీయాల్సిన సమయం వచ్చింది. అప్పులు ఎవరు కడతారో..ఎలా కడతారో చెప్పాలని నిలదీయాల్సిన అవసరం వచ్చింది. కిషన్ రెడ్డినో, రేవంత్ రెడ్డినో, బండిసంజయ్‌నో విమర్శించి పబ్బం గడుపుకునే రోజులు పోయాయని కెటిఆర్, హరీష్ రావులు గుర్తించాలి. ప్రజలను ఇంకా మాయమాటలతో మోసపుచ్చలేమని గుర్తించాలి. వారివల్ల ఒక్క పనికాదని గత పదేళ్లలో తేలిపోయింది. పార్లమెంట్ ఎన్నికల్లో బిఆర్ఎస్ ఓడిస్తేనే వాళ్లు చేసిన పాపాలు పూర్తిగా పరిహారం అవుతాయి. గత పదేళ్లలో విభజన సమస్యలు ఇంకా పరిష్కారం కాలేదు. వాటిని సాధించడంలో బిఆర్ఎస్ ఎంపిలు కనీస ప్రయత్నం చేయలేదు. అప్పుడే చేయని వారు ఇప్పుడు చేస్తారన్న భరోసా లేదు. ఈ కీలక సమయంలో బిఆర్ఎస్ ఎంపిలు ఢిల్లీలో ఉంటే..తెలంగాణకు మరింత నష్టమని గుర్తించాలి. ఇది పాముకు పాలుపోయడమే అవుతుంది. అందువల్ల బిఆర్ఎస్ పట్ల ప్రజలు జాగరూకతతో ఉండాలి. అప్పుడే తెలంగాణకు మేలు చేకూరుతుంది.

# స్వామిగౌడ్, ప్రకాశ్ గౌడ్‌లతో పొన్నం చర్చలు

## కాంగ్రెస్‌లో చేరాలని కోరినట్లు సమాచారం● నేరుగా ఇంటికి వెళ్లి చర్చించినట్లు ప్రచారం



హైదరాబాద్,జనవరి 18 (సమ సమాజం): తెలంగాణ కాంగ్రెస్ పార్టీ చేరికలపై దృష్టి పెట్టింది. శాసనమండలి మాజీ చైర్మన్ స్వామిగౌడ్ ను పార్టీలో చేర్చుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. ఈ మేరకు మంత్రి పొన్నం ప్రభాకర్ రాజేంద్రనగర్ లో స్వామిగౌడ్ నివాసానికి వెళ్లారు. స్వామిగౌడ్‌తో పాటు కుటుంసభ్యులతో చర్చించారని తెలుస్తోంది. పార్టీలో చేరిక ఆహ్వానంపై స్వామిగౌడ్ ఎలా స్పందించారన్నదానిపై ఇంకా స్పష్టత రాలేదు. పొన్నం ప్రభాకర్ రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ తోనూ చర్చలు జరిపినట్లుగా తెలుస్తోంది. టీఎన్జీవో నాయకుడుగా తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన స్వామిగౌడ్.. బీఆర్ఎస్ తో తన రాజకీయ ప్రస్థానం మొదలు పెట్టారు. కరీంనగర్ పట్టభద్రుల నియోజకవర్గం నుంచి శాసన మండలికి ఎన్నికయ్యారు. తెలంగాణ ఏర్పాటైన తర్వాత శాసన మండలి తొలి చైర్మన్ గా ఆయనకు కీలక పదవి అప్పగించారు.గతేడాది ఏప్రిల్‌లో శాసనమండలి సభ్యుడిగా, మండలి చైర్మన్‌గా పదవీ కాల పరిమితి పూర్తి చేసుకున్న స్వామిగౌడ్ కొంతకాలంగా టీఆర్ఎస్ పార్టీ కార్యకలాపాల్లో అంతగా కనిపించట్లేదు. గతంలో గవర్నర్ కోటాలో శాసనమండలికి నామినేట్ అయిన స్వామిగౌడ్ 2018 అసెంబ్లీ ఎన్నికల్లో రాజేంద్రనగర్ స్థానం నుంచి టీఆర్ఎస్ టికెట్ ఆశించారు. ఆ తర్వాత జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో చేవెళ్ల నుంచి పోటీకి ఆసక్తి చూపినా అవకాశం లభించలేదు. ఏదేని ముఖ్యమైన కార్పొరేషన్ పదవి దక్కుతుందని ఆశించినా పార్టీ అధిష్టానం నుంచి స్పందన లేకపోవడంతో స్వామిగౌడ్ అసంతృప్తికి గురయ్యారు. ఈ క్రమంలో 2020లో ఆయన బీఆర్ఎస్ ని వీడి బీజేపీ కండువా కప్పుకున్నారు. అయితే అక్కడ కూడా ఆయన ఉండలేక తిరిగి బీఆర్ఎస్ గూటికి చేరుకున్నారు. తాజా అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓటమి తర్వాత స్వామిగౌడ్ తన రాజకీయ భవిష్యత్ గురించి పునరాలోచించారు. పొన్నం ప్రభాకర్ ఆహ్వానంతో కాంగ్రెస్ లోకి వెళ్లే అవకాశాలు కనిపిస్తున్నాయి.రేవంత్ రెడ్డితో స్వామిగౌడ్‌కు సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. గతంలో సర్వాయి పాపన్న విగ్రహావిష్కరణ కార్యక్రమంలో రేవంత్ రెడ్డిని పొగిడారు. 'బడుగు, బలహీన వర్గాలకు రేవంత్‌రెడ్డి బలమైన వెన్నుపూస, చేతికర్రగా మారారు. తెల్లబట్టల నేతలకు అమ్ముడుపోవద్దని అంటూ రేవంత్‌రెడ్డిపై ప్రశంసలు కురిపించారు. 'తెలంగాణ ఉద్యమంలో స్వామిగౌడ్ అన్న పాత్ర ఎవరూ కాదనలేనిది. సమైఖ్య పాలనలో ఆయనపై దాడిచేసిన అధికారులకు కీలక బాధ్యతలిచ్చారు. తెలంగాణ బడుగు, బలహీనవర్గాల బిడ్డను గుర్తింపులేకుండా పక్కనపెట్టారు'అని రేవంత్‌రెడ్డి కూడా ప్రశంసించారు. అయితే అప్పట్లో కాంగ్రెస్ పార్టీ పరిస్థితి అంత ఆశాజనకంగా లేదు. అంతే కాదు..రేవంత్ రెడ్డి పీసీసీ చీఫ్ గా కూడా లేరు. అందుకే కాంగ్రెస్‌లో చేరకుండా బీజేపీలో చేరారు. ఇప్పుడు రేవంత్ కూడా ఆహ్వానించే అవకాశం ఉంది.. ఉద్యమకారులకు గుర్తింపునిస్తామని రేవంత్ చెబుతున్నారు కాబట్టి పార్టీలో చేరే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.

# కేంద్రప్రభుత్వ ఉద్యోగులకు శుభవార్త

## రామప్రతిష్ఠ సందర్భంగా 22న సెలవు మంజూరు



న్యూఢిల్లీ, జనవరి 18 (సమ సమాజం): కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు ప్రభుత్వం గురువారం శుభవార్త అందించింది. అయోధ్య రామమందిర ప్రాణ ప్రతిష్ఠను పురస్కరించుకుని జనవరి 22న ఈ కార్యక్రమాన్ని లైవ్‌లో వీక్షించేందుకు అనుగుణంగా సెలవు మంజూరు చేసింది. ఆ రోజు ఉద్యోగులకు సగం పని దినాన్ని వర్తింపచేస్తూ నోటిఫికేషన్ జారీ చేసింది. కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ దీన్ని ధృవీకరించారు. ప్రధాని నరేంద్ర మోదీ రామ మందిర ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమ సన్నాహాల గురించి మంత్రుల వద్ద ఫీడ్‌బ్యాక్ తీసుకున్నట్లు తెలిసింది. మంత్రుల ఇళ్ల వద్ద దీపాలు వెలిగించి పేదలకు భోజనం పెట్టాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమాన్ని పండుగలా జరుపుకోవాలని కోరారు. 22 వ తేదీ తరువాత ఆయా నియోజకవర్గాలకు ప్రాతినిధ్యం వహిస్తున్న మంత్రులు ప్రజలకు అయోధ్యను ఉచితంగా చూపించాలని ప్రధాని సూచించారు. వారితో కలిసి ప్రజా ప్రతినిధులు రాములోరిని దర్శించుకోవాలన్నా రు. ఇండియా కూటమికి చెందిన నేతలు రామ మందిర ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమానికి హాజరుకా బోమని ఇదివరకే తెలిపారు. ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని బీజేపీ రాజకీయం చేసిందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆరోపించారు. ఎన్సీపీ అధినేత శరద్‌పవార్, ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ కూడా ఈ కార్యక్రమానికి దూరంగా ఉంటామన్నారు.

# ఇళ్ల పథకంలో వడ్డీరాయితీ జమ

## రియంబర్స్‌మెంట్ కింద రూ.46.9 కోట్లు విడుదల ■ బటన్ నొక్కి మహిళల ఖాతాల్లో జమచేసిన సిఎం జగన్




అమరావతి,జనవరి 18 (సమ సమాజం): రాష్ట్రంలో 12.77 లక్షల మంది అక్క చెల్లెమ్మలకు పావలావడ్డీ రుణాలు ఇప్పించామని, ఈ దఫాలో 4.07 లక్షల మందికి వడ్డీ రియింబర్స్ కింద రూ.46.9 కోట్లు విడుదల చేస్తున్నామని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు గురువారం తాడేపల్లిలోని క్యాంప్ కార్యాలయం నుంచి బటన్ నొక్కి బ్యాంక్ ఖాతాల్లో నగదు జమ చేశారు. ప్రతి ఆరు నెలలకు ఒకసారి ఈకార్యక్రమం జరుగుతుంది. గతంలో సుమారు ఐదు లక్షలకు పైబడి అక్క చెల్లెమ్మలకు రూ.50 కోట్ల పైబడి ఇచ్చాం. రూ.35వేల రుణాలను పావలా వడ్డీకే ఇస్తున్నాం. దేశ చరిత్రలో ఎప్పుడూ కూడా జరగని విధంగా 31,19,000 ఇళ్ల స్థలాలు ఇచ్చాం. అందులో ఇప్పటికే 22లక్షలకు పైగా ఇళ్ల నిర్మాణం జరుగుతోంది. ఒక్కో ఇంటికి 2.7 లక్షలు ఖర్చు అవుతుంది. మౌలిక సదుపాయాలకు మరో రూ.1 లక్ష ఖర్చు అవుతోంది. ఇళ్ల నిర్మాణంకోసం ఉచితంగా ఇసుక ఇస్తున్నాం అని సీఎం జగన్ పేర్కొన్నారు. 'సిమెంటు, స్టీల్, మెటల్ ఫ్రేంలు తదితర ఇంటి సామగ్రి మీద కనీసంగా రూ.40వేలు మంచి జరిగేలా చూస్తున్నాం. ఒక్కో ఇంటి స్థలం విలువ జిల్లాను బట్టి, ప్రాంతాన్ని బట్టి రూ.2.5లక్షల నుంచి రూ.15 లక్షల వరకూ ఉంది. అన్ని కలుపుకుంటే దాదాపు ప్రతి అక్క చెల్లెమ్మకు రూ.5 -20 లక్షల వరకూ ఒక ఆస్తిని ఇవ్వగలిగాం. ఈ అవకాశం దేవుడు నాకు ఇచ్చినందుకు చాలా సంతోషంగా ఉంది. కేవలం పావలా వడ్డీకే రూ.35వేల చొప్పున రుణాలు ఇప్పిస్తున్నాం. ఈ మంచి కార్యక్రమాన్ని మరింత ముందుకు తీసుకెళ్తామని సీఎం జగన్ తెలిపారు. 'నవరత్నాలు-పేదలందరికీ ఇళ్లు' పథకం కింద రికార్డు స్థాయిలో నివేశన స్థలాలను పంపిణీ చేయడంతోపాటు ఇళ్లను మంజూరు చేశారు. ఇళ్ల నిర్మాణానికి ఆర్థిక సాయం చేయడంతో పాటు రాయితీపై సావిమవిగ్రి అందిస్తున్నారు. ఇళ్ల లబ్దిదారులు బ్యాంకు నుంచి పొందిన రుణాలకు వడ్డీని కూడా రీయింబర్స్‌మెంట్ చేవియవినున్నారు. తొలి విడత లబ్దిదారులకు వడ్డీని రీయింబర్స్‌మెంట్ చేశారు. సీఎంగా వైఎస్ జగన్ బాధ్యవితలు స్వీకరించిన తర్వాత రాష్ట్రవ్యాప్తంగా 71,811.50 ఎకరాల విస్తీర్ణంలో 31లక్షల ఇళ్ల పట్టాలను అక్కచెల్లెమ్మల పేరిట పంపిణీ చేశారు. ఇంటి నిర్మాణానికి యూనిట్‌కు రూ.1.80 లక్షలు చొప్పున ఇవ్వడమే కాకుండా, ఉవిచివితంగా ఇసుక సరఫరా ద్వారా రూ.15 వేలు, సివిమెంట్, స్టీలు, మెటల్ ఫ్రేమ్స్, ఇతర నిర్మాణ సామగ్రిని తక్కువ ధరకే అందించడంతో మరో రూ.వి40 వేల మేర లబ్ది కల్పిస్తున్నారు. పావలా వడ్డీకే రూ.35వేలు చొప్పున బ్యాంకు రుణం అందిస్తున్నారు. ఇలా మొత్తంగా ఒక్కో లబ్దిదారుకు రూ.రూ2.70 లక్షలు చొప్పున లబ్ది చేకూరుస్తున్నారు. దీనికి అదనంగా మరో రూ.లక్షకు పైగా ప్రతి ఇంటిపై మౌలిక వసతులకు ఖర్చు పెడుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 22 లక్షల ఇళ్ల నిర్మాణం చేపడుతుండగా, ఇప్పటికే 8.6 లక్షలకు పైగా ఇళ్లు పూర్తి చేసి లబ్దిదారులకు ప్రభుత్వం అందించింది. మిగిలిన ఇళ్ల నిర్మాణ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. బ్యాంకులు 9 నుంచి 11 శాతం వడ్డీవితో రుణాలు ఇస్తున్నాయి. అయినా వారిపై భారం పడకుండా పావలా వడ్డీకే రుణాలు అందిస్తూ ఆపై వడ్డీ భారాన్ని ప్రభుత్వమే భరిస్తోంది. తొలి దఫా అర్హులైన 4,07,323 మంది లబ్దిదారులకు వడ్డీ రీయింబర్స్‌మెంట్ కింద రూ.46.90 కోట్లను గురువారం తాడేపల్లిలోని క్యాంప్ కార్యాలయం నుంచి సీఎం వైఎస్ జగన్ బటన్ నొక్కి బ్యాంక్ ఖాతాల్లో జమ చేశారు. ఇలా సంవత్సరంలో రెండు పర్యాయాలు వడ్డీ రీయింబర్స్‌మెంట్‌ను ప్రభుత్వం అందించనుంది.

# ముందు చేనేతపై 5శాతం జిఎస్టీ ఎత్తేయండి

## బండి సంజయ్‌కు మంత్రి పొన్నం కౌంటర్



హైదరాబాద్,జనవరి 18 (సమ సమాజం): బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ సిఎం రేవంత్‌కు రాసిన లేఖపై స్పందించిన మంత్రి పొన్నం ప్రభాకర్ ట్వీట్ చేశారు. అలాగే సిరిసిల్ల చేనేత కార్మికులను ఆదుకోవాలని సీఎం రేవంత్ రెడ్డికి బండి సంజయ్ లేఖ రాసారు. దీనిపై మంత్రి ట్వీట్ చేస్తూ...మీ మొసలి కన్నీరు ఆపి.. ముందు మీ బాధ్యత నెరవేర్చి చేనేత కార్మికుల భారాన్ని తగ్గించాలన్నారు. చేనేత వస్త్రాలపై 5 శాతం జీఎస్టీని కేంద్రంతో రద్దు చేయించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం రద్దు చేసిన చేనేత బోర్డును పునరుద్ధరించాలి.. చేనేత కార్మికుల భీమాను, రాయితీలను తిరిగి ప్రారంభించాలి.. సిరిసిల్లలో మెగా పవర్ లూమ్ క్లస్టర్ ఏర్పాటు ప్రతిపాదనలు కేంద్రం వద్ద పెండింగ్‌లో ఉన్నాయి.. మల్లా ఆడలేక పాత గజ్జెలు అంటే ఎలా?.. ఎవరి సలహాలు.. అవసరం లేకుండా.. నరులకు నాగరికత నేర్పిన చేనేతను ఆదుకుని తీరుతాం అని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. అంతకుముందు మంత్రి పొన్నం ప్రభాకర్‌కు బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ కౌంటర్ ఇచ్చారు. అయోధ్య అక్షింతలను రేషన్ బియ్యం అనడం మంచి పద్దతి కాదని, అక్షింతలు అంటే ఎమిటో మీ కుటుంబ సభ్యులను అడగాలని, వాటి ప్రాముఖ్యత గురించి తెలియకుండా మాట్లాడవద్దన్నారు. రామ మందిర ప్రాణ ప్రతిష్టని రాజకీయం చేయొద్దన్నారు. అక్షింతలను రేషన్ బియ్యం అనే వారికి వాటి ప్రాముఖ్యత, పవిత్రత తెలియదన్నారు. అక్షింతల గురించి కామెంట్లు చేస్తే వారి ఇంట్లో వాళ్ళు అక్షింతలు వేస్తారని బండి సంజయ్ వ్యాఖ్యానించారు.

# తెలుగువారి దమ్ము, ధైర్యం ఎన్టీఆర్

## నివాళి అర్పించిన బాలకృష్ణ



హైదరాబాద్,జనవరి 18 (సమ సమాజం): తెలుగువారి దమ్ము, ధైర్యం ఎన్టీఆర్ అని కుమారుడు, హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ అన్నారు. ఎన్టీఆర్‌కు మరణం లేదని, ప్రజల హృదయాల్లో చిరకాలం సజీవంగా ఉన్నారని తెలిపారు. ఎన్టీఆర్ ఘాట్ వద్ద బాలకృష్ణ తదితరులు ఘనంగా నివాళి అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..ఎన్టీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు చిరస్థాయిగా నిలచిపోతాయని తెలిపారు. ఎన్టీఆర్ అమలు చేసిన పథకాలను మిగతా రాష్ట్రాలు ఆదర్శంగా తీసుకున్నాయని వివరించారు. పేదవారి ఆకలిని ఎన్టీఆర్ తీర్చారని గుర్తుచేశారు. మహిళలకు ఆస్తిలో సమాన హక్కును ఎన్టీఆర్ కల్పించారని బాలకృష్ణ తెలిపారు. పటేల్, పట్వారీ వ్యవస్థను రద్దు చేశారని పేర్కొన్నారు. కొందరు ఎన్టీఆర్‌ను దైవంగా చూస్తారని బాలకృష్ణ పేర్కొన్నారు. ఎన్టీఆర్ నడిచిన మార్గం స్ఫూర్తిదాయకం అని వివరించారు. ఎన్టీఆర్ చూపిన మార్గంలో టీడీపీ కార్యక్రతలు నడవాలని బాలకృష్ణ కోరారు. ఆంధ్రప్రదేశ్‌లో తెలుగుదేశం పార్టీని తిరిగి అధికారంలోకి తీసుకొస్తాం అని బాలకృష్ణ వెల్లడించారు. టీడీపీ వ్యవస్థాపక అధ్యక్షులు, దివంగత నందమూరి తారక రామారావు 28వ వర్ధంతి సందర్భంగా ఎన్టీఆర్ ఘాట్ వద్ద కుటుంబ సభ్యులు నివాళులర్పించారు. కుమారుడు బాలకృష్ణ, మనమళ్లు జూనియర్ ఎన్టీఆర్, కల్యాణ్ రామ్, మనమరాలు అలేఖ్య రెడ్డి అంజలి ఘటించారు.

# రైతులలకు కార్పొరేట్ తరహాలో లాభాలు

(మొదటి పేజీ తరువాయి)



టాటా అడ్వాన్స్ డ్ సిస్టమ్స్ లిమిటెడ్ ఇప్పటికే గ్లోబల్ డిఫెన్స్, ఏరోస్పేస్ రంగంలో పలు ప్రాజెక్టులు చేపట్టింది. బోయింగ్, సికోర్స్ కీ, జిఇ, లాక్‌హీడ్ మార్టిన్ వంటి కంపెనీలతో కలిసి పెట్టుబడులు పెట్టింది. ాష్ట్రంలోని ప్రభుత్వ ఐటీఐలను అడ్వాన్స్ డ్ టెక్నాలజీ సెంటర్లుగా అప్ గ్రేడ్ చేసేందుకు టాటా టెక్నాలజీస్ లిమిటెడ్ ప్రభుత్వ భాగస్వామ్యంతో ఈ కొత్త ప్రాజెక్టు చేపడుతోంది. లాంగ్ టర్మ్, షార్ట్ టర్మ్ కోర్సులతో పాటు నైపుణ్యాల మధ్య అంతరాన్నితగ్గించే బ్రిడ్జి కోర్సులు నిర్వహిస్తుంది. కొత్త కోర్సులకు పెట్టుబడులు పెడుతుంది. టాటా గ్రూప్ కు చెందిన ఎయిర్ ఇండియా విస్తరణలోనూ హైదరాబాద్ ను ట్రాన్సిట్ హబ్ గా ఎంచుకోనుంది. హైదరాబాద్ నుంచి డొమెస్టిక్, ఇంటర్నేషనల్ విమానాల కనెక్టివిటీని పెంచనుంది. తెలంగాణ అభివృద్ధికి టాటా గ్రూప్ కీలకమైన భాగస్వామ్యం అందిస్తోందని ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి అన్నారు. వివిధ రంగాలలో పెట్టబడులు పెడుతున్న టాటా గ్రూప్ నకు తగిన సహకారం అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ప్రభుత్వ ఐటీఐలలో అధునాతన నైపుణ్య కేంద్రాల ఏర్పాటుకు టీటీఎల్ బాగస్వామ్యం పంచుకోవటం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో స్కిల్ యూనివర్సిటీలను నెలకొల్పేందుకు చొరవ చూపాలని సీఎం టాటా గ్రూప్ ను స్వాగతించారు.మ గ్రూప్ పెట్టుబడులకు తెలంగాణ వ్యూహాత్మకమైన కేంద్రంగా ఉందని, వీలైనంత మేరకు రాష్ట్రంలో తమ గ్రూప్ వ్యాపారాలను రాష్ట్రంలో విస్తరిస్తామని టాటా సన్స్ చైర్మన్ నటరాజన్ చంద్రశేఖరన్ అన్నారు. కొత్త ప్రభుత్వంతో కలిసి పని చేయాలనే ఆసక్తితో ఎదురు చూస్తున్నామని అన్నారు. ఈ సమావేశంలో పరిశ్రమలు, వాణిజ్యం. ఐటీ శాఖ మంత్రి డి. శ్రీధర్ బాబు, ప్రిన్సిపల్ సెక్రటరీ జయేష్ రంజన్, ఇన్వెస్ట్ మెంట్ ప్రమోషన్ స్పెషల్ సెక్రెటరీ విష్ణువర్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# శ్రీరామ జన్మభూమి పై స్మారక పోస్టల్ స్టాంప్

(మొదటి పేజీ తరువాయి)

రామాలయం, గణెళిశుడు, హనుమంతుడు, జటాయువు, శబరి మొదలైనవి ఉన్నాయి. ఈ 48 పేజీల పుస్తకంలో అమెరికా, న్యూజిలాండ్, సింగపూర్, కెనడా, కంబోడియా, ఐక్యరాజ్యసమితి వంటి సంస్థలు సహా 20కి మించిన దేశాలు విడుదల చేసిన పోస్టల్ స్టాంపులు ఉన్నాయి.



# నేడు తమిళనాడుకు ప్రధాని మోడీ

## ఆలయాలను సందర్శించి పవిత్ర జలాల సేకరణ▪భారీగా భద్రతా ఏర్పాట్లు చేస్తున్న అధికారులు



చెన్నై,జనవరి 18 (సమ సమాజం): ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆలయదర్శనం కొనసాగుతోంది. 22న అయోధ్య ప్రతిష్టాపనకు ముందే దేశంలోని ప్రముఖ ఆలయాలను సందర్శిస్తున్నారు. స్థానికంగా ప్రజల్లో చైతన్యం కలిగించే ప్రయత్నం చేస్తున్నారు. ఈ క్రమంలో ఈ నెల 19న శుక్రవారం చెన్నైకి రానున్నారు. ఇక్కడ మూడు రోజులపాటు రాష్ట్రంలో పర్యటించనున్నట్లు తెలుస్తోంది. అయోధ్య రామాలయంలో ప్రాణప్రతిష్ఠ జరుగనున్న నేపథ్యంలో ఆయన దేశవ్యాప్తంగా సుప్రసిద్ధ ఆలయాలకు వెళ్లి ఆయా ప్రాంతాల్లోని నదులు, తీర్థాల నుంచి పవిత్ర జలాలను సేకరిస్తున్నారు. ఇందులో భాగంగా ఈనెల 19వ తేదీ సాయంత్రం 4.50 గంటలకు మోదీ బెంగళూరు నుంచి ప్రత్యేక విమానంలో చెన్నైకి వస్తున్నారు. విమానాశ్రయం వద్ద గవర్నర్ ఆర్ఎన్ రవి, ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్, మంత్రులు, బీజేపీ రాష్ట్ర నాయకులు ఆయనకు ఘనస్వాగతం పలకనున్నారు. ఆ తర్వాత విమానాశ్రయం నుంచి హెలికాప్టర్‌లో మెరీనా బీచ్ నేపియర్ బ్రిడ్జి సమీపంలోని అడయార్ ఐఎన్ఎస్ హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. అక్కడి నుంచి కారులో నెహ్రూ స్టేడియానికి చేరుకుంటారు. ఆ స్టేడియంలో 'ఖేలో ఇండియా' పోటీలను ఆయన ప్రారంభించనున్నారు. చెన్నై, మదురై, తిరుచ్చి, కోయంబత్తూరు నగరాల్లో ఈ పోటీలు ఈనెల 19 నుంచి 31వ తేదీ వరకు జరగనున్న విషయం తెలిసిందే. ఈ పోటీల్లో 18 ఏళ్లలోపు క్రీడాకారులు ఆరువేల మందికిపైగా పాల్గొంటున్నారు. ఈ క్రీడల ప్రారంభోత్సవాల్లో ప్రధానితోపాటు గవర్నర్‌రవి, ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్, కేంద్ర క్రీడాశాఖ మంత్రి అనురాగ్‌సింగ్ ఠాకూర్, రాష్ట్ర క్రీడాశాఖ మంత్రి ఉదయనిధి తదితరులు పాల్గొంటారు. సాయంత్రం 7.30 గంటలకు ఈ వేడుకలు పూర్తయ్యాక ప్రధాని మోదీ కారులో గిండిలోని రాజ్‌భవన్‌కు చేరుకుంటారు. రాజ్‌భవన్‌లో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై, పార్టీ సీనియర్ నేతలతో ఆయన భేటీ అవుతారు. రాత్రి ప్రధాని మోదీ రాజ్‌భవన్‌లోనే బసచేస్తారు. మరుసటి రోజు శ్రీరంగానికి బయలుదేరి వెళతారు. రాజ్‌భవన్ నుంచి కారులో ఉదయం 9.25 గంటలకు మీనంబాక్కం విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడి నుంచి విమానంలో తిరుచ్చికి చేరుకుంటారు. తిరుచ్చి నుంచి కారులో శ్రీరంగం ఆలయానికి చేరుకుంటారు. ఆలయంలో స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొంటారు. ఆ ఆలయ పరిసరాల్లో 'స్వచ్ఛ్ తీర్థ్' పేరుతో పారిశుధ్య కార్యక్రమంలో భాగంగా ఆలయ పరిసరాలను శుభ్రం చేయనున్నారు. శ్రీరంగం ఆలయంలో ఆయన ఉదయం 11 నుంచి 12.40 గంటలవరకు ఉంటారు. ఆ తర్వాత అక్కడి నుండి హెలికాప్టర్‌లో బయలుదేరి మధ్యాహ్నం 2.10 గంటలకు రామేశ్వరానికి బయలుదేరి వెళతారు. రామేశ్వరం రామనాథస్వామివారి ఆలయానికి వెళ్ళి ప్రత్యేక పూజల్లో పాల్గొంటారు. ఆ తర్వాత ఆలయ పరిసరాలను శుభ్రం చేయనున్నారు. ఆ రోజు రాత్రి రామేశ్వరంలోని శ్రీరామకృష్ణ మఠంలో బస చేయనున్నారు. ఈ నెల 21 ఉదయం రామేశ్వరం అగ్నితీర్థం కడలిలో స్నానమాచరిస్తారు. మళ్లీ రామనాథస్వామిలో సేవలో పాల్గొంటారు. అక్కడ ప్రత్యేక పూజాది కార్యక్రమాల్లో పాల్గొంటారు. తరువాత కారులో అరిచల్ మునై ప్రాంతానికి వెళతారు. ఉదయం 10.25 గంటలకు అక్కడి కోదండ రామాలయాన్ని సందర్శిస్తారు. ఆ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ఉదయం 11.25 గంటల వరకు ఆలయంలోనే గడుపుతారు. అటు పిమ్మట అయోధ్య రామాలయం కోసం సముద్రంలో తీర్థ జలాలను సేకరించనున్నారు. ఇలా ఆలయాలలో సేకరించిన పవిత్ర జలాల కలశాలతో ఆయన హెలికాప్టర్‌లో మదురై విమానాశ్రయం చేరుకుంటారు. అక్కడి నుంచి విమానంలో ఢిల్లీకి బయలుదేరి వెళతారు. ప్రధాని మోదీ పర్యటన సందర్భంగా చెన్నై, తిరుచ్చి, శ్రీరంగం, రామేశ్వరం తదితర ప్రాంతాల్లో భారీ భద్రతా ఏర్పాట్లు చేపడుతున్నారు.

# వింగ్స్ ఇండియా హైదరాబాద్‌కు గర్వకారణం



(మొదటి పేజీ తరువాయి) యూఎస్‌ఏకు నేరుగా వారంలో కనీసం మూడుసార్లు విమానం వేయాలని జ్యోతిరాదిత్య సింధియాను కోరామన్నారు. ఎయిర్ అంబులెన్స్‌లు ఎక్కువగా హైదరాబాద్‌కు వస్తున్నాయని, డ్రోన్ పైలెట్లకు ఎక్కువగా శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. వ్యవసాయ, అత్యవసరాలకు, శాంతిభద్రతల కోసం డ్రోన్లు వినియోగిస్తున్నా మని, రాష్ట్రంలో సులభతర వాణిజ్య విధానం ఉందని, ఏరో స్పేస్ పెట్టుబడులకు హైదరాబాద్ ఎంతో అనుకూలంగా ఉందని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం నుంచి హైద్రాబాద్ మహానగరంలో 'ఇంటర్నేషనల్ వింగ్స్ ఇండియా ఎయిర్ షో' మొదలు అయ్యింది. నాలుగు రోజుల పాటు జరిగే ఈ ఈవెంట్‌కు దేశ విదేశాల ప్రతినిధులు హాజరుకానున్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద విమానం బోయింగ్ 777-9 తో పాటు అనేక విమానాలను ఇక్కడ ప్రదర్శించనున్నారు. ఈనెల 21వ తేదీ వరకు జరిగే ఈవెంట్‌లో దేశ విదేశాలకు చెందిన ఏరోప్లేన్స్ కనువిందు చేస్తాయి. ఈ ప్రదర్శనలో 106 దేశాల నుంచి సుమారు 1500 మంది ప్రతినిధులు హాజరవుతారు. ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న వింగ్స్ ఇండియా కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది.

# ఉచిత బస్ ప్రయాణం వివక్ష




(మొదటి పేజీ తరువాయి) పథకంపై అధికారం రాష్ట్రానికి లేదని.. జీవో 47 రద్దు చేయాలని పిటిషనర్ పేర్కొన్నారు. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణాన్ని నిలిపివేస్తూ వెంటనే ఉత్తర్వులు జారీ చేయాలని న్యాయస్థానాకి పిటిషనర్ విజ్ఞప్తి చేశారు. ఉచిత ప్రయాణం సౌకర్యం కల్పించడంతో ఆర్టీసీ బస్సులు మహిళలతో కిటకిటలాడుతున్నాయి. రద్దీ ఎక్కువగా ఉండడంతో సీట్ల కోసం గొడవలు కూడా జరుగుతున్నాయి. పురుషులకు సీట్లు కూడా దొరకని పరిస్థితి ఉంది. మహిళల రద్దీ కారణంగా టికెట్లు కొనుగోలు చేసి వెళ్లే పురుష ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని పిటిషనర్ పేర్కొన్నారు.

# హంతకులే సంతాప సభ పెట్టినట్టుగా ఉంది




(మొదటి పేజీ తరువాయి) ప్లాట్‌ఫామ్ ఎక్స్ వేదికగా కేటీఆర్‌కు మంత్రి పొన్నం ప్రభాకర్ కౌంటరిచ్చారు. 10 సంవత్సరాల మీ పాలనలో సర్పంచ్‌లు బిల్లులు రాక ఆత్మహత్యలు చేసుకున్నది నిజం కాదా? అని కేటీఆర్‌ను మంత్రి ప్రశ్నించారు. మీ హయాంలో సర్పంచ్‌లకు ఇవ్వాల్సిన రూ.1100 కోట్ల బిల్లులు పెండింగ్‌లో పెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ హయాంలో 20 మంది సర్పంచ్‌లు ఆత్మహత్యలు చేసుకున్నారని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆవేదన వ్యక్తం చేశారు. కాగా మంగళవారం సిరిసిల్లలోని బీఆర్ఎస్ ఆఫీస్‌లో నిర్వహించిన జిల్లా సర్పంచుల ఆత్మీయ సమావేశంలో పాల్గొన్న కేటీఆర్.. కరోనా కారణంగా సర్పంచులకు బిల్లులు చెల్లించలేక పోయాం. వాటిని ఈ సర్కారు ఇస్తుందని ఆశిస్తున్నాం. లేదంటే మీ తరఫున గొంతు విప్పడానికి నేను సిద్ధంగా ఉంటా అని అన్నారు. ఈ నేపథ్యంలోనే కేటీఆర్‌కు మంత్రి పొన్నం ప్రభాకర్ కౌంటర్ ఇచ్చారు. కాగా సర్పంచుల ఆత్మీయ సమావేశంలో కేటీఆర్ మాట్లాడుతూ.. తమ హయాంలో 1,858 తండాలను గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేశామని, కొత్తగా 9,355 గ్రామ పంచాయతీ సెక్రటరీలను నియమించారని తెలిపారు. అలాగే స్థానిక సంస్థల అభివృద్ధి కోసం నూతనంగా అడిషనల్ కలెక్టర్ పోస్ట్‌ను కూడా సృష్టించామని చెప్పుకొచ్చారు. దీనికి మంత్రి పొన్నం ఘాటుగా స్పందించారు. అధికారంలో ఉండగా నిర్లక్ష్యంగా, అహంకారపూరితంగా వ్యవహరించి ఇప్పుడు మాట్లాడుతున్నారని మండిపడ్డారు.

# వెయ్యిమంది బాలకృష్ణలు వచ్చినా ..



(మొదటి పేజీ తరువాయి) నాయుడు, నటుడు, బాలయ్యపై కొడాలి నాని ఆగ్రహం వ్యక్తం చేశారు. లోకేష్ కోసం జూనియర్ ఎన్‌టిఆర్‌ను నాశనం చేసే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపణలు చేశారు. దివంగత మాజీ ముఖ్యమంత్రి ఎన్‌టిఆర్‌ను వెన్నుపోటు పొడిచిన వారే..వర్ధంతి చేస్తారా? అని నాని చురకలంటిం చారు. జూనియర్ ఎన్‌టిఆర్ ఫ్లెక్సీలు తొలగించినంత మాత్రాన ఏమీ కాదని, బాలకృష్ణ ఆదేశాలతోనే ఎన్‌టిఆర్ ఫ్లెక్సీలు తొలగించారని నాని దుయ్యబట్టారు. ఎన్‌టిఆర్ ఫ్లెక్సీలు తొలగించడమనేది నీచాతినీచమైన చర్య అని మండిపడ్డారు. జైలుకురా కదలిరా అని చంద్రబాబుకు కోర్టు చెప్పిందని ఎద్దేవా చేశారు. ఎన్‌టిఆర్ ఆశయాలను ముందుకు తీసుకెళ్తామని నాని స్పష్టం చేశారు. తలకిందులుగా తపస్సు చేసినా చంద్రబాబును ఎవరూ పట్టించుకోరని, లోకేష్‌ను సిఎం చేయాలన్నదే బాబు ఆలోచని పనిచేయదని ధ్వజమెత్తారు. హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ ఘాట్ వద్ద జూనియర్ ఎన్టీఆర్ ఫ్లెక్సీల తొలగింపుపై వివాదం రాజుకున్నది. ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా తారక్ అభిమానులు ఎన్టీఆర్ ఘాట్ వద్ద ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. అయితే ఎన్టీఆర్ సమాధి వద్ద నివాళులర్పించిన బాలకృష్ణ.. అక్కడి నుంచి తిరిగివెళ్తూ ఆ ఫ్లెక్సీలను తొలగించాలంటూ ఆదేశించారు. ప్రస్తుతం ఈ వీడియో నెట్టింట వైరల్‌గా మారింది. దీనిపై గుడివాడ ఎమ్మెల్యే కొడాలి నాని తీవ్రంగా స్పందించారు. తన అల్లుడు నారా లోకేశ్ కోసం జూనియర్ ఎన్టీఆర్ ఫ్లెక్సీలను బాలయ్య తొలగిస్తున్నారని నాని ఆగ్రహం వ్యక్తంచేశారు. గతంలో పెద్ద ఎన్టీఆర్‌ను దించిన బాలకృష్ణ.. ఇప్పుడు తారక్ ఫ్లెక్సీల మీద పడ్డారని విమర్శించారు. బాలయ్య లాంటి వాళ్లు ఎంత మందివచ్చినా జూనియర్ ఎన్టీఆర్ వెంట్రుక కూడా పీకలేరని స్పష్టం చేశారు. ఫ్లెక్సీలు తొలగించడం నీచమైన చర్యగా అభివర్ణించారు. చంద్రబాబు, బాలకృష్ణలు తారక్‌ను ఏమీ చేయలేరని వెల్లడించారు.

# 2028 కల్ల భారత్ స్పేస్ స్టేషన్



(మొదటి పేజీ తరువాయి) ఉంటుంది. ఈ మొత్తం స్టేషన్ 25 టన్నుల బరువు ఉంటుంది. అవసరమైతే తర్వాత దీనిని విస్తరిస్తాం. స్పేస్ స్టేషన్ ద్వారా మైక్రో గ్రావిటీ పరిశోధనలు చేస్తాం' అని సోమనాథ్ తెలిపారు. కాగా, ఇప్పటివరకు నింగిలో అంతర్జాతీయ స్పేస్ స్టేషన్(ఐఎస్ఎస్) మాత్రమే ఉంది. దీనిని అమెరికా, కెనడా, జపాన్, యూరప్ సంయుక్తంగా నిర్మించాయి. 1984నుంచి 1993 మధ్య ఐఎస్ఎస్‌ను డిజైన్ చేశారు.

# గజ్వేల్‌లో కెసిఆర్‌ను ఓడించేందుకు కుట్ర



(మొదటి పేజీ తరువాయి) పెట్టే ప్రయత్నం చేశారన్నారు. అయినా కూడా ఎంతో అద్భుతంగా పని చేసి కేసీఆర్ గెలుపు కోసం కృషి చేశారన్నారు.ఈ విజయం బీఆర్ఎస్ కార్యకర్తలదేనని అన్నారు. బీఆర్ఎస్ కుటుంబ సభ్యులకు శిరస్సు వంచి నమస్కారం తెలియజేస్తున్నానన్నారు. ఈ విజయం కార్యకర్తలదేనని.. అందరి కష్టమన్నారు. శ్రేణులకు కృతజ్ఞతలు చెప్పేందుకు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గజ్వేల్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల కృతజ్ఞత సభ గురువారం జరిగింది. కార్యక్రమానికి సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ అధినేతపై 154 నామినేషన్లు వేశారని.. అనేక కుట్రలు.. విత్ డ్రా తర్వాత 47 నామినేషన్లు మిగిలాయన్నారు. నాలుగు మిషన్ల ఏర్పాటుతో కొందరు గందరగోళానికి గురయ్యారన్నారు. కారు గుర్తుకు పడాల్సిన ఓట్లు వేరే గుర్తులకు పడ్డాయన్నారు. ఇన్ని కుట్రలు జరిగినా కేసీఆర్ 45వేల మెజారిటీతో గెలిపించి.. మూడోసారి గెలుపు అందించారన్నారు. గజ్వేల్ ప్రజలందరికీ కేసీఆర్, బీఆర్ఎస్ పార్టీ తరుపున ధన్యవాదాలు తెలిపారు. గజ్వేల్ అభివృద్ధి ఎంతో జరిగిందని.. మొన్న జరిగిన అసెంబ్లీలో గజ్వేల్‌పై అక్కసు కాంగ్రెస్ వెళ్లగక్కిందని విమర్శించారు. కేసీఆర్ ఇక్కడికి వచ్చాక తాగు, సాగునీటి సమస్య లేదన్నారు. కేసులు తగ్గాయని.. కుట్రలు తగ్గాయన్నారు. గత చరిత్రను బీఆర్ఎస్ తిరగరాసిందన్నారు. ఒక్కనాడు కాంగ్రెస్ నాయకులపై కేసుకు పెట్టలేదన్నారు. గజ్వేల్ ఎలా బాగు చేయాలి అని నిరంతరం కేసీఆర్ ఆలోచించారన్నారు. కానీ కాంగ్రెస్ వచ్చి నెల రోజుకు కాలేదని.. బెదిరింపులకు పాల్పడుతూ కేసులు పెడుతున్నారన్నారు. కేసీఆర్ గజ్వేల్‌ను అభివృద్ధిలో ముందుకు తీసుకెళ్తే.. కాంగ్రెస్ వాళ్లు కేసులు, కుట్రలతో ముందుకు తీసుకెళ్తున్నారన్నారు. డిసెంబర్ 9న రుణమాఫీ అన్నారని.. రూ.4వేలకు ఫించన్లు పెంచుతామన్నారని.. కరెంట్ బిల్లు కట్టొద్దు అన్నారన్నారు. రైతుబంధు పెంచుతాం అన్నారని.. వడ్లకు రూ.500 బోనస్ ఇస్తామనన్నారని.. నిరుద్యోగ భృతి ఇస్తామని చెప్పి ఇప్పుడు చేతులెత్తేశారన్నారు. ప్రగతి భవన్‌లో 250 గదులున్నాయని.. బంగారు బాత్ రూములు ఉన్నాయని ఆరోపణలు చేశారని.. అక్కడ ఉంటున్న ఉప ముఖ్యమంత్రి భట్టి వాస్తవాలు చెప్పాలన్నారు. బీజేపీతో కొట్లాడతం అని దోస్తీ చేస్తున్నది ఎవరని ప్రశ్నించారు. బండి సంజయ్, అరవింద్, ఈటల రాజేందర్, రఘునందన్‌ను ఓడగొట్టింది బీఆర్ఎస్ పార్టీయేనన్నారు. ఈ దేశం అదానీ, అంబానీల చేతుల్లో ఉందని.. అదానీ అవినీతి వెనుక ప్రధాని ఉన్నారని.. ఈ ఇద్దరి చేతుల్లో 500 కంపెనీలు ఉన్నాయని రాహుల్ గాంధీ అంటున్నారని.. రేవంత్ రెడ్డి, అదానీ కలిసి హగ్‌లు, షేక్ హ్యాండ్ ఇచ్చుకుంటున్నారన్నారు. ఇందులో రాహుల్ కరెక్టా, రేవంత్ కరెక్టా.. ? అంటూ ప్రశ్నించారు. పాలమూరు ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇవ్వబోమంటే బీజేపీ కాంగ్రెస్ వాళ్లు ఎందుకు కొట్లాడం లేదని నిలదీశారు. మెడలు వంచుతామని చెప్పిన కాంగ్రెస్ వాళ్లు, బీజేపీ కేంద్రమంత్రుల మెడలో నేడు పూలదండలు వేస్తున్నారని విమర్శించారు. ఎవరు ఎవరితో కుమ్మక్కయ్యారో తెలంగాణ ప్రజలకు స్పష్టంగా అర్థమవుతున్నదన్నారు. కేటీఆర్ దావోస్ వెళ్లి పెట్టుబడులు తీసుకువస్తే దండగా అన్నారని.. ఉత్తమ్ కుమార్‌రెడ్డి అక్కడికి వెళ్లడం వేస్ట్ అన్నారని.. మరి ఇప్పుడు సీఎం రేవంత్‌రెడ్డి సైతం దావోస్ వెళ్లారని.. దానిపై ఏం సమాధానం చెబుతారని మాజీ మంత్రి హరీశ్‌రావు ప్రశ్నించారు.

# ఎమ్మెల్సీ ఎన్నికలకు ఇద్దరే నిమినేషన్లు



(మొదటి పేజీ తరువాయి) నామినేషన్‌లు వేశారు. నామినేషన్ దాఖలుకు గురువారం ఆఖరి రోజు కావడంతో కాంగ్రెస్ అభ్యర్థులు మహేష్ కుమార్ గౌడ్, బల్మూరి వెంకట్‌లు నామినేషన్ పత్రాలు సమర్పించారు. ఇదిలా ఉండగా.. ప్రతిపక్షాల నుంచి ఎవరూ నామినేషన్ వేయలేదు. దీంతో, వీరి ఎన్నిక ఏకగ్రీవం కానుంది. మరోవైపు.. శుక్రవారం నామినేషన్ల పరిశీలన కొనసాగనుంది. ఈనెల 22వ తేదీ వరకు నామినేషన్ల ఉప సంహరణకు గడువు ఉంది. అదే రోజున మధ్యాహ్నం మూడు గంటలకు అభ్యర్థుల ఎన్నికపై ప్రకటన వెలువడనుంది.

# ఆరు నెల్లో కాంగ్రెస్‌పై ప్రజా తిరుగుబాటు

(మొదటి పేజీ తరువాయి) పార్లమెంట్ ఎన్నికల్లో త్రిముఖ పోటీ ఉండే అవకాశం ఉందన్నారు. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ గెలుపు అవకాశాలు బలంగా ఉన్నాయని నమ్మకం వెలిబుచ్చారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో ఎమ్మెల్సీలు విస్తృతంగా పనిచేయాలని కోరారు. జిల్లా కేంద్రంగా పార్టీ కార్యక్రమాలను మరింత యాక్టివేట్ చేస్తామన్నారు. త్వరలోనే మాజీ సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో ఎమ్మెల్సీలతో సమావేశం ఉంటుందని.. అందులోనే శాసన మండలి పార్టీ నేతను ఎన్నుకోవడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన 420 హామీల అమలు కోసం శాసనసభలో బీఆర్ఎస్ పార్టీ తరఫున ఒత్తిడి కొనసాగిస్తామని కేటీఆర్ పేర్కొన్నారు. ఇచ్చిన హామీలను అమలు చేయాలని కాంగ్రెస్‌కు గుర్తు చేస్తామన్నారు. హామీలను అమలు చేయకుండా తప్పించుకునే ప్రయత్నం చేస్తే.. అసెంబ్లీలో ఉన్న బలమైన ప్రతిపక్షాలు శాసనసభ వేదికగా ప్రశ్నిస్తాయని హెచ్చరించారు. శాసనమండలి సభ్యులు పార్టీకి కళ్లు, చెవుల మాదిరిగా పని చేయాలని అన్నారు. శాసనమండలి సభ్యులు తమ నియోజకవర్గాల్లోని పార్టీ శ్రేణులతో సమన్వయం చేసుకోవాలన్నారు. పార్టీని గ్రామస్థాయి నుంచి పొలిట్ బ్యూరో వరకు పునర్వ్యవస్థీకరించాలని పార్టీ అధ్యక్షుడు కేసీఆర్ భావిస్తున్నారని చెప్పారు. చురుకైన నాయకులు, కార్యకర్తల సేవలను పార్టీ ఉపయోగించుకుంటుందని కేటీఆర్ చెప్పుకొచ్చారు. తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ పార్టీ మహబూబ్‌నగర్ లోక్‌సభ నియోజకవర్గ సన్నాహక సమావేశం జరిగింది. సభకు మాజీ మంత్రులు నిరంజన్‌రెడ్డి, వీ శ్రీనివాస్‌గౌడ్, లక్ష్మారెడ్డి, కడియం శ్రీహరి, మాజీ స్పీకర్‌లు పోచారం శ్రీనివాస్‌రెడ్డి, మధుసూదనాచారి, ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి, పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని నేతలు హాజరయ్యారు.

# హైదరాబాద్‌లో ట్రాఫిక్ క్రమబద్దీకరణ

(మొదటి పేజీ తరువాయి) నోటీసులు ఇస్తామని మాదాపూర్ ట్రాఫిక్ డీసీపీ, డీవీ శ్రీనివాస్ హెచ్చరించారు. రోడ్డు ప్రమాదాలు నివారించడానికి పాదచారులు ఫుట్ పాత్, ఫుట్ ఓవర్ బ్రిడ్జి లను వినియోగించుకోవాలని సూచించారు. ఆటో డ్రైవర్లు, క్యాబ్ డ్రైవర్లు తప్పనిసరిగా యూనిఫాం వేసుకోవాలని సూచించారు. రాంగ్ రూట్ లో వాహనం నడిపి యాక్సిడెంట్ చేస్తే 304 పార్ట్2 ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఫుట్ పాత్ అక్రమిస్తున్న వ్యాపారుల మీద చర్యలు తీసుకుంటున్నామన్నారు.సైబరాబాద్ పరిధిలో 55 పేలికన్ సిగ్నల్స్ ఉన్నాయని తెలిపారు. భారీ వాహనాలు డీసీఎం, వాటర్ ట్యాంకర్స్, ఆర్ఎంసీ, జేసీబీ,ట్రాక్టర్ వంటి వాహనాలకు ఉదయం 7:30గంటల నుంచి 11.30 వరకు, సాయంత్రం 4గంటల నుంచి 10గంటల 30 నిముషాల వరకు అనుమతి లేదని చెప్పారు డీసీపీ శ్రీనివాస్. కన్స్ట్రక్షన్ .. భవనాలు కూల్చివేసే వాహనాలకు ఉదయం 6 గంటల నుంచి రాత్రి 10:30 వరకు అనుమతి లేదన్నారు. నిషేధిత సమయాల్లో భారీ వాహనాలు రోడ్లపై తిరిగితే మోటార్ వాహనాల యాక్ట్ లో సెక్షన్ ల ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# షర్మిల రాకతో కాంగ్రెస్‌లో నూతనోత్తేజం

**ఏకమవుతున్న కాంగ్రెస్ వాదులు**

**పార్టీ బలోపేతానికి కలసి రానున్న పరిస్థితులు**



విజయవాడ, జనవరి 18 (సమ సమాజం): ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలిగా షర్మిల బాధ్యతలు చేపట్టనున్న సందర్భంగా ఏపి కాంగ్రెస్‌లో మళ్లీ కదలిక వచ్చే సూచనలు కనిపిస్తున్నాయి. ఇప్పటికే పలువురు సీనియర్లు రహస్యంగా మంతనాలు జరుపుతున్నారు. చురకుగా వ్యవహరించేందుకు ముందుకు వస్తున్నారు. ఇందులో ప్రధానంగా ఆనాడు వైఎస్‌కు అత్యంత సన్నిహితంగా ఉన్న కెవిపి రామచంద్రారావు మరోమారు చురుకుగా వ్యవహరించే అవకాశం ఉంది. దీనినితోడు వైసిపిలో అసంతృప్త నేతలంతా షర్మిల వైపు చేరవచ్చు. మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి ఇప్పటికే షర్మిలతో కలసి నడుస్తానని ప్రకటించారు. ఉండవల్లి అరుణ్ కుమార్, హర్షకుమార్, టి. సుబ్బరామిరెడ్డి వంటి ఉద్దండులు మరోమారు తెరపైకి వచ్చే అవకాశాలున్నాయి. షర్మిలకు కాంగ్రెస్ పార్టీ హైకమాండ్ చీఫ్‌గా బాధ్యతలు ఇచ్చింది. కుమారుడి పెళ్లి పనుల్లో కాస్త బిజీగా ఉన్న షర్మిల రెండు, మూడు రోజుల్లో బాధ్యతలు తీసుకునే అవకాశం ఉంది. ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ పుంజుకుందన్న నమ్మకాన్ని కలిగించడం కోసం షర్మిల ముందుగా అందరిని కలుసుకుని ముందుకు సాగే అవకాశం ఉంది. అందుకోసం ప్రజల్లో నమ్మకం కలిగించేలా పర్యటనలు చేసే అవకాశం కూడా ఉంది. గతంలో పాదయాత్రతో ప్రజల్లో కదలిక తెచ్చిన చరిత్ర ఆమెది. గత ఎన్నికల్లో నోటా కంటే తక్కువ ఓట్లు కాంగ్రెస్ పార్టీకి వచ్చాయి. అంటే ఒక శాతం కన్నా తక్కువ. ఇప్పుడు షర్మిలపై కాంగ్రెస్ పార్టీ ఎన్నో ఆశలు పెట్టుకుంది. ప్రభుత్వ వ్యతిరేకత, కాంగ్రెస్‌పై ప్రజల్లో అభిమానం వెనక్కి తెచ్చుకోవడం వైఎస్ కుమార్తెగా మళ్లీ పార్టీ బాధ్యతలు తీసుకోవడం వంటివన్నీ కలసి ఆరనున్నాయి. వైఎస్ అనుచరులు కూడా ఆమె వెంట నడిచే అవకాశాలు ఉన్నాయి. జగన్‌తో ఇమడలేని వారు ముందుగా షర్మిలను అనుసరిస్తారు. ఇలా అనేక అంశాల ద్వారా కాంగ్రెస్ పార్టీ మళ్లీ పూర్వ వైభవం కోసం ప్రయత్నించవచ్చు ఈ విషయం అంతా షర్మిల చేతుల్లోనే ఉంది. ఆంధ్రాలో కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు జీరో పొజిషన్‌లో ఉంది. ఆ పార్టీ పోగొట్టుకోవడానికి ఏమీ లేదు. ఎంత వచ్చినా వచ్చినట్లే. కాంగ్రెస్ పార్టీని ఉపయోగించుకుని షర్మిల బలం పుంజుకుంటే ఆమె రాజకీయ జీవితం మలుపు తిరుగుతుంది. ఇప్పటికే తెలంగాణలో షర్మిల రాజకీయ పార్టీ పెట్టి ,సుదీర్ఘమైన పాదయాత్ర చేసి ఎన్నో వ్యయప్రయాసలకు ఓర్చి పార్టీని నడిపినా నాన్ లోకల్ అన్న భావన ప్రజల్లో నాటుకు పోయింది. కాంగ్రెస్ పార్టీకి మద్దతు ప్రకటించి పోటీ నుంచి విరమించుకోవడం ద్వారా వ్యూహాత్మక నిర్ణయం తీసుకున్నారనే చెప్పాలి. అక్కడ పోటీ చేసి ఉన్నట్లయితే ఇప్పుడు ఏపీలో రాజకీయంగా ఎదిగే అవకాశం వచ్చివుండేద ఇకాదు. కాంగ్రెస్ అధికారంలోకి రావడం వల్ల ఆమెకు సువర్ణావకాశం వచ్చినట్లే. రాజకీయంగా బలోపేతం అవ్వాలనుకుంటే.. షర్మిలకు కాంగ్రెస్ గొప్ప చాన్స్ ఇచ్చినట్లేనని భావించాలి. ఏ రాజకీయ పార్టీకి అయినా ఓటు బ్యాంక్ అనేది ఉండాలి. అలా ఉంటేనే ఆ పార్టీ ఎన్నికల రేసులోకి వస్తుంది.కాంగ్రెస్ పార్టీకి ఉన్న ఓటు బ్యాంక్ జగన్‌కు బదలా యింపు జరిగింది. ఓ రకంగా ఇప్పుడ షర్మిల కాంగ్రెస్ పగ్గాలు చేపట్టడం వల్ల ఆ ఓటుబ్యాంక్ ఎంతోకొంత కాంగ్రెస్‌కు చేరుతుంది. గట్టిగా ప్రయత్నిస్తే జగన్‌పై ఉన్న అసంతృప్తి కారణంగా మరింత జమకాగలదు. సంప్రదాయ కాంగ్రెస్ వాదులు అందరూ ఇష్టం ఉన్నా లేకపోయినా ఇంతకాలం వైఎస్ఆర్ కాంగ్రెస్‌కు మద్దతుగా నిలిచారు. కాంగ్రెస్ కు ఓటు వేస్తే లాభం లేదన్న భావనలో జగన్‌కు అండగా ఉంటూ వచ్చారు. జగన్ నాయకత్వంలో ఉన్న పార్టీలోనే చాలా మంది కాంగ్రెస్‌ను చూసుకుంటున్నారు. కాంగ్రెస్ కు మద్దతుగా ఉన్న వర్గాలన్నీ గుంపగుత్తగా వైఎస్ జగన్ కు మద్దతు పలకడమే దీనికి సంకేతం. ఇప్పుడు వైఎస్ మరో బిడ్డ కాంగ్రెస్ ద్వారా ఎంట్రీ ఇస్తున్న కారణంగా వీరంతా మళ్లీ వెనక్కి వచ్చే అవకాశం ఉంది. ఏపీలో వివిధ కారణాలతో ప్రభుత్వ వ్యతిరేకత తీవ్రంగా ఉందన్న ప్రచారం జరుగుతోంది. ఇలాంటి సమయంలో కాంగ్రెస్ ఓటు బ్యాంక్‌ను మళ్లీ వెనక్కి తెచ్చుకోవడానికి షర్మిలకు అవకాశం వచ్చింది. అయితే ఇది అంత తేలికైన వ్యవహారం కాదు. పూర్తి స్థాయిలో షర్మిల నాయకత్వ సామర్థ్యం చూపించి.. కాంగ్రెస్సే మన పార్టీ అందర్నీ నమ్మించగలగాలి. విభజన హామీలకు గట్టి భరోసా ఇవ్వగలగాలి. తాను తలపడబోయే ప్రత్యర్థుల్లో కుటుంబసభ్యులు ఉంటారు. సోదరుడు జగన్మోహన్ రెడ్డి నేతృత్వంలోని వైసీపీతోనే ఆమె ఎక్కువ పోరాటం చేయాలి. ఎందుకంటే ఆ పార్టీ నుంచే ఓటు బ్యాంక్ వెనక్కి రావాల్సి ఉంది. ఇందు కోసం షర్మిల కఠినమైన నిర్ణయాలు తీసుకోవాల్సి రావొచ్చని చెబుతున్నారు. అందులో మొదటిది తాను స్వయంగా కడప పార్లమెంట్ లేదా పులివెందుల అసెంబ్లీకి పోటీ చేయడం. ఎక్కడ పోటీ చేసినా ఖచ్చితంగా కుటుంబసభ్యుల మీదుగానే పోటీ చేయాల్సి ఉటుంది.కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి మంచి దారి అవుతుంది. ఇప్పుడు షర్మిల జగన్మోహన్ రెడ్డి లేదా అవినాష్ రెడ్డిపై పోటీ చేయడం ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీకి ఊపు తీసుకు వచ్చే అవకాశం ఉంది.

## దళితబంధు కోసం వాటర్ ట్యాంక్ ఎక్కి నిరసన

ములుగు, జనవరి 18 (సమ సమాజం): గత బిఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన దళితబంధు పథకాన్ని కొనసాగిస్తూ నిధులను విడుదల చేయాలని కొందరు కోరుతున్నారు. తక్షణమే నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ములుగు జిల్లా కలెక్టరేట్‌లో ఉన్న వాటర్ ట్యాంక్‌ను ఎక్కి దళిత బంధు లబ్దిదారులు ఆందోళన చేపట్టారు. మంత్రి సీతక్క, కలెక్టర్ రావాలని డిమాండ్ చేశారు. దళితులు ఆర్థికంగా ఎదిగే ఈ పథకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం రద్దు చేయాలని ఆలోచన చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు.దళితులను ఉద్దేశించి ప్రవేశపెట్టిన పథకానికి ఉన్న అడ్డంకులన్నీ తొలగించి లబ్దిదారులకు న్యాయం చేయాలని కోరారు. దీంతో కలెక్టరేట్ వద్ద ఉద్రిక్తత నెలకొంది. తమకు న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామని వారు హెచ్చరించారు.

## కుప్పకూలిన నిర్మాణంలో ఉన్న వంతెన

**గ్రీన్‌ఫీల్డ్ జాతీయ రహదారిలో ఘటన**

ఖమ్మం, జనవరి 18 (సమ సమాజం): ఖమ్మం జిల్లాలో నిర్మాణంలో ఉన్న వంతెన ఒక్కసారిగా కుప్పకూలింది. గ్రీన్ ఫీల్డ్ జాతీయ రహదారిలో భాగంగా వైరా-మధిర మధ్య భారీ వంతెన నిర్మిస్తున్న విషయం తెలిసిందే. గురువారం మధ్యాహ్నం బ్రిడ్జిపై సిమెంట్ కాంక్రీట్ పోస్తుండగా స్లాబ్ ఒక్కసారిగా కుప్పకూలింది. వైరా మండలం సోమవరం దగ్గర ఈ ఘటన జరిగింది. భారీ శబ్దం రావడంతో అటుగా వెళ్లే వాహనదారులు భయాందోళనకు గురయ్యారు. వంతెన మీద ఉన్న కూలీలు ప్రాణాలు రక్షించుకునేందుకు బ్రిడ్జిపైనుంచి కిందకు దూకేశారు. దీంతో పలువురు కూలీలకు స్వల్ప గాయాలయ్యాయి. నిర్మాణ పనుల్లో నిర్లక్ష్యం, నాసిరకంగా నిర్మించడం కారణంగానే ఈ ప్రమాదం జరిగిందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. కాగా ఖమ్మం నుంచి దేవరపల్లి వరకు నిర్మిస్తున్న గ్రీన్‌ఫీల్డ్ హైవే పనులను హెచ్‌డీ ఇన్ఫ్రా ఇంజనీరింగ్ లిమిటెడ్ సంస్థ నిర్మిస్తుంది.

# విమానయాన రంగంలో ఎన్నో అవకాశాలు

**30కోట్ల మందిని విమానయనాన్నికి చేరువ చేసే లక్ష్యం**

**వింగ్స్ ఇండియాతో దేశ పౌరవిమానయాన ఘనత**

**కేంద్రమంత్రి జ్యోతిరాదిత్య సింధియా వెల్లడి**



హైదరాబాద్, జనవరి 18 (సమ సమాజం): ప్రధాన మంత్రి మోదీ నేతృత్వంలో దేశం ముందుకు దూసుకుని పోతున్నదని కేంద్ర మంత్రి జ్యోతిరాదిత్య సింధియా అన్నారు. వింగ్స్ ఇండియా 2024 కార్యక్రమంతో ప్రపంచస్థాయిలో దేశ పౌరవిమానయాన ఘనత చాటి చెప్పొచ్చని ఆయన అన్నారు.గురువారం బేగంపేట్ ఏయిర్ పోర్ట్ లో ఫిక్కీ ఆధ్వర్యంలో నిర్వహించే... వింగ్స్ ఇండియా 2024, గ్లోబల్ ఏవియేషన్ సమ్మిట్ ను కేంద్ర మంత్రి జ్యోతిరాదిత్య సింధియా ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ..విమానయాన రంగంలో ఎన్నో అవకాశాలు ఉన్నాయని... అత్మనిర్బర్ భారత్ కార్యక్రమం పౌర విమానయాన రంగానికి ఎంతో తోడ్పాటునందిస్తోందన్నారు. గత ఏడాది 15.2కోట్ల మంది ప్రయాణికులు విమానాల్లో ప్రయాణించారని తెలిపారు. 2030 కల్లా 30కోట్ల మందిని విమానయనాన్నికి దగ్గర చెయాలనేది తమ లక్ష్యమని చెప్పారు. ప్రపంచంలో అత్యధిక ఎయిర్ క్రాఫ్ట్ లను భారత్ కొనుగోలు చేస్తోందని.. మన దగ్గర 57 ఫ్లయింగ్ ట్రైడ్ ఆర్గనైజేషన్ లు ఉన్నాయని తెలిపారు. రాబోయే రోజుల్లో 10వేల మంది మహిళలకు డ్రోన్లపై శిక్షణ ఇస్తామని సింధియా చెప్పారు. డ్రోన్లకు 80శాతం రాయితీ ఇవ్వనున్నట్లు తెలిపారు. బోయింగ్, ఎయిర్ బస్ నుంచి ప్రపంచస్థాయి విమానాలను పలు సంస్థలు కొనుగోలు చేస్తున్నాయన్నారు. అంతర్జాతీయ విమానాల ప్రదర్శనకు హైదరాబాద్ మరోసారి వేదికైంది. ఆసియాలోనే అతిపెద్ద పౌర విమానయాన ప్రదర్శనా కార్యక్రమం వింగ్స్ ఇండియా 2024 బేగంపేట విమానాశ్రయంలో గురువారం ప్రారంభమైంది. మినిస్ట్రీ ఆఫ్ సివిల్ ఏవియేషన్ మరియు ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ , ఇండియన్ ఇండస్ట్రీ ఆధ్వర్యంలో వింగ్స్ ఇండియా ప్రదర్శన నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమానికి దేశ విదేశాలకు చెందిన ప్రతినిధులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో కేంద్ర సహాయ మంత్రి వీకే సింగ్, రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పలువురు అధికారులు పాల్గొన్నారు. ఏవియేషన్ పరిశ్రమలో అత్యుత్తమమైనవి తమ వినూత్న విమానయాన సాంకేతికత, విమాన యంత్రాలను ప్రదర్శిస్తాయి. దీని థీమ్ 'అమృత్ కాల్‌లో భారతదేశాన్ని ప్రపంచానికి అనుసంధానించడమని.. ఇది భారత పౌర విమానయానానికి వేదిక అంటూ కేంద్ర మంత్రి జ్యోతిరాదిత్య సింధియా పేర్కొన్నారు. పౌర విమానయాన రంగంలో ఎన్నో ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామని, గత రెండేళ్లలో ప్రయాణికుల సంఖ్య 260 మిలియన్‌లు పెరిగిందన్నారు. రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ.. వింగ్స్ ఇండియా కార్యక్రమానికి ఆతిథ్యం ఇస్తున్నందుకు సంతోషంగా ఉందంటూ పేర్కొన్నారు. రాష్ట్రంలో ఎన్నో అవకాశాలు ఉన్నాయని, తెలంగాణ దేశంలోనే ఎంతో అభివృద్ధి చెందుతోందని తెలిపారు. హైదరాబాద్ నుంచి అమెరికాకు నేరుగా వారంలో మూడు సార్లు విమాన సౌకర్యం కల్పించాలని జ్యోతిరాదిత్య సింధియాను కోరామని తెలిపారు.రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ.. వింగ్స్ ఇండియా కార్యక్రమానికి ఆతిథ్యం ఇస్తున్నందుకు సంతోషంగా ఉందంటూ పేర్కొన్నారు. రాష్ట్రంలో ఎన్నో అవకాశాలు ఉన్నాయని, తెలంగాణ దేశంలోనే ఎంతో అభివృద్ధి చెందుతోందని తెలిపారు. హైదరాబాద్ నుంచి అమెరికాకు నేరుగా వారంలో మూడు సార్లు విమాన సౌకర్యం కల్పించాలని జ్యోతిరాదిత్య సింధియాను కోరామని తెలిపారు. హైద్రాబాద్ మహానగరంలో నాలుగురోజుల పాటు ఇంటర్నేషనల్ వింగ్స్ ఇండియా ఎయిర్ షో జరగనుంది. ప్రపంచంలోనే అతిపెద్ద విమానం బోయింగ్ 777-9 విమానంతో పాటు అనేక విమానాల ప్రదర్శన జరగనుంది. ప్రదర్శనలో 106 దేశాల నుంచి సుమారు 1500 మంది ప్రతినిధులు హాజరుకానుండగా.. దీనికోసం ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసింది. అన్ని రకాల విమానాలు వింగ్స్ ఇండియా ప్రదర్శనలో పాల్గొననున్నాయి. భారత వాయుసేనకు చెందిన సారంగ్ బృందం ఈనెల 18 నుంచి 21 వరకు విన్యాసాలు నిర్వహిస్తుంది. 18న మధ్యాహ్నం ఒంటి గంట నుంచి 2 వరకు, సాయంత్రం 4.15 నుంచి 5, 19న ఉదయం 11 నుంచి 12 వరకు, మధ్యాహ్నం ఒంటి గంట నుంచి 2 వరకు, సాయంత్రం 4.15-5 వరకు విన్యాసాలు ఉంటాయి. 20, 21వ తేదీల్లో సందర్శకులను అనుమతిస్తారు. దీని టికెట్ రూ.750గా నిర్ణయించారు. 'బుక్‌మైషో' యాప్ ద్వారా టికెట్లను కొనుగోలు చేయవచ్చు. మూడేళ్లలోపు పిల్లలకు ఉచితం.

# కోలుకుంటున్న తమ్మినేని



(మొదటి పేజీ తరువాయి) రావాలని ఆకాంక్షించారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వెంట మునుగోడు శాసనసభ్యుడు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ క్యాంపెయిన్ కమిటీ కో కన్వీనర్ అజ్మతుల్లా, తదితరులు ఉన్నారు. కాగా, తమ్మినేని వీరభద్రం ఆరోగ్యం నిలకడగా ఉన్నదని, ప్రాథమికంగా అందిస్తున్న చికిత్సకు ఆయన స్పందిస్తున్నారని ఏఐజీ వైద్యులు వెల్లడించిన విషయం తెలిసిందే. ఈ నెల 16న అనారోగ్యంతో ఆయన ఏఐజీలో చేరిన విషయం తెలిసిందే. ప్రత్యేక వైద్యబృందం పర్యవేక్షణలో ఆయనకు చికిత్స అందిస్తున్నామని, మరో 24 నుంచి 48 గంటలు అత్యంత కీలకమని, అప్పటివరకు వైద్య బృందం నిరంతరం పర్యవేక్షించడంతో పాటు వెంటిలేషన్‌తో కూడిన చికిత్స అందించడం జరుగుతుందని వెల్లడించారు.

# రామాలయంతో బిజెపి రాజకీయం

**హిందుత్వ బిజెపి నుంచి నేర్చుకోవాల్సిన ఖర్మ పట్టలేదు**



ఖమ్మంలో సోనియా..లేదంటే తానే అభ్యర్థి● మాజీ ఎంపి రేణుకా చౌదరి వ్యాఖ్య

ఖమ్మం, జనవరి 18 (సమ సమాజం): అయోధ్య రాముడిని బీజేపీ ఎన్నికల అస్త్రంగా మార్చుకుందని కాంగ్రెస్ సీనియర్ నేత రేణుకా చౌదరి సంచలన ఆరోపణలు చేశారు. అయోధ్యలో రామ మందిర నిర్మాణం ఇంకా పూర్తి కాలేదని వివరించారు. హడావిడిగా 22వ తేదీన రామ్ లల్లా ప్రాణ ప్రతిష్ఠ చేస్తున్నారని మండిపడ్డారు. దీనిని శంకరాచార్యులు, మఠాధిపతులు వ్యతిరేకించారని తెలిపారు. తమ స్వార్థం కోసం హిందూ సాంప్రదాయాలకు వ్యతిరేకంగా బీజేపీ వ్యవహరిస్తుందని ధ్వజమెత్తారు. ఖమ్మం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో గురువారం నాడు రేణుకా చౌదరి మీడియాతో మాట్లాడారు. హిందువు ఎలా ఉండాలో బీజేపీ నేతలు చెబితే నేర్చుకోవాల్సిన అవసరం తమకు లేదని రేణుకా చౌదరి అన్నారు. శ్రీరాముడిని దర్శించుకోవడానికి బీజేపీ నేతల అనుమతి అవసరం లేదన్నారు. రాముడి దర్శనం కోసం ఆహ్వానం ఉంటే చాలు అని చెప్పడానికి బీజేపీ నేతలకు ఏ అర్హత ఉందని రేణుకా చౌదరి ప్రశ్నించారు. ఎప్పుడు కావాలంటే అప్పుడు శ్రీరాముడిని దర్శించుకుంటామని తెలిపారు. రాముడు చూపిన బాటలో నడుస్తున్నామని వివరించారు. జనవరి 22వ తేదీన ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమం చేపట్టేందుకు గల కారణాన్ని రేణుకా చౌదరి వివరించారు. 22 తర్వాత పార్లమెంట్ ఎన్నికల నోటిఫికేషన్ రాబోతుందని తెలిపారు. అంతకుముందు ప్రాణ ప్రతిష్ఠ చేయడంతో ఓటు బ్యాంక్ రాజకీయాలకు పాల్పడిందని ఆరోపించారు. ఈ సారి ఎన్నికలకు రాముడిని అస్త్రంగా వాడుకోవాలని బీజేపీ అనుకుంటుందని పేర్కొన్నారు. వారి ఆటలు ఇక సాగవని, కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడబోతుందని తెలిపారు. పార్లమెంటు ఎన్నికలకు ముందు కాంగ్రెస్ సీనియర్ నేత రేణుకా చౌదరి సంచలన వ్యాఖ్యలు చేశారు. ఖమ్మం నుంచి ఎంపీగా పోటీ చేసేందుకు కాంగ్రెస్ సీనియర్లు ఆసక్తిచూపుతున్న తరుణంలో.. అక్కడి నుంచి పోటీ చేసే హక్కు తనకు మాత్రమే ఉందని ఖరాఖండీగా చెప్పేశారు. తాను కోరుకుంటే కాదనే శక్తి ఎవరికీ లేదని పేర్కొన్నారు. అయితే కాంగ్రెస్ అధినేత్రి సోనియాగాంధీని ఖమ్మం నుంచి పోటీ చేయాలని కోరామని రేణుకా చౌదరి తెలిపారు. ఇదే విషయమై సీఎం రేవంత్ రెడ్డి చర్చలు జరుపుతున్నారని ఆమె చెప్పారు. సోనియా ఇక్కడికి వస్తే తమకు మహాభాగ్యమని అన్నారు. ఆమె నిర్ణయం చెప్పే వరకు ఎవరూ అభ్యర్థి కాదని తెలిపారు. సోనియాగాంధీకి తప్ప ఎవరికీ ఈ స్థానం ఇచ్చే అవకాశమే లేదని స్పష్టం చేశారు.

# అయోధ్యరాముడికి సిరిసిల్ల బంగారుచీర

**ప్రధానికి సమర్పించనున్న నేతన్న**



సిరిసిల్ల, జనవరి 18 (సమ సమాజం): అయోధ్య శ్రీరామచంద్రుడికి సిరిసిల్ల నుంచి బంగారు చీరను కానుకగా పంపించనున్నారు. సిరిసిల్లకు చెందిన నేతన్న హరిప్రసాద్ స్వయంగా తయారు చేసిన బంగారు చీరను ఈ నెల 26న ప్రధాని నరేంద్ర మోదీకి అందించనున్నారు. ప్రధాని చేతుల మీదుగా శ్రీరాముడి పాదాల చెంత ఈ చీరను ఉంచనున్నారు. ఈ క్రమంలో నేతన్న హరిప్రసాద్ నివాసానికి బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ వెళ్లి.. బంగారు చీరను పరిశీలించారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ.. సిరిసిల్లలో అద్భుతమైన చేనేత కళాకారులు ఉన్నారని.. గతంలో అగ్గిపెట్టెలో పట్టే చీరను తయారుచేసిన చరిత్ర సిరిసిల్ల జిల్లాకు ఉందని గుర్తు చేశారు. ఇంతటి గొప్ప నైపుణ్యాన్ని సొంతం చేసుకున్న చేనేత రంగాన్ని ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. చేనేత కార్మికులను ఆదుకునేందుకు తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. చీరను 8 గ్రాముల బంగారం, 20 గ్రాముల వెండితో రూపొందించారు. రామాయణ ఇతివృత్తం తెలియజేసే చిత్రాలతో ఈ చీరను చేనేత కళాకారుడు హరిప్రసాద్ తయారు చేశారు.

# వైసిపికి కౌంట్ డౌన్ మొదలు

● జగన్ ప్రభుత్వ పతనం ఖాయం● కొడాలి నానిది నోరా..డ్రైనేజా

● గుడివాడ సభలో చంద్రబాబు నిప్పులు

గుడివాడ, జనవరి 18 (సమ సమాజం): వైసిపికి కౌంట్ డౌన్ మొదలయ్యిందని, ఈ ప్రభుత్వాన్ని సాగనంపడం ఖాయమని టిడిపి అధినేత చంద్రబాబు అన్నారు. తెలుగు దేశం - జనసేన పార్టీ కలిశాయని తెలియగానే వైసీపీ నేతల్లో దడ మొదలైందని టిడిపి అధినేత చంద్రబాబు అన్నారు. అప్పటి నుంచి ఏ సర్వే చూసినా టీడీపీ-జనసేన కూటమే గెలుస్తుందని తేల్చుతున్నాయని అన్నారు. ఆ విషయం తెలిసి జగన్ కు నిద్రపట్టడం లేదని చంద్రబాబు ఎద్దేవా చేశారు. అందుకే 90 మంది సిట్టింగ్ ఎమ్మెల్యేలను మార్చుతున్నారని అన్నారు. రాజకీయాల్లో ఎక్కడా తాను ట్రాన్స్‌ఫర్లు చూడలేదని.. జగన్ మాత్రం ఇక్కడి చెత్త అక్కడ.. అక్కడి చెత్త ఇక్కడికి మార్చుతున్నారని అన్నారు. ఒకచోట చెల్లని వారు మరోచోట ఎలా పనికి వస్తారని చంద్రబాబు నిలదీశారు. మరో 83 రోజులే ఈ ప్రభుత్వానికి సమయం ఉందని, ఆ తర్వాత వైసీపీని భూస్థాపితం చేసేయాలని చంద్రబాబు పిలుపు ఇచ్చారు. ఎన్టీఆర్ జిల్లాలోని గుడివాడ నియోజకవర్గంలో చంద్రబాబు రా.. కదలిరా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా చంద్రబాబు సీఎం జగన్ పై ఘాటు వ్యాఖ్యలు చేశారు. గుడివాడ ఎమ్మెల్యే కొడాలి నానిపై కూడా చంద్రబాబు సెటైర్లు వేశారు. ఆయనది నోరా డ్రైనేజా అని ఎద్దేవా చేశారు. ఎంత ఫినాయిల్ వేసి కడిగినా అతని నోరు మురికి కాలువే అని ఎగతాళి చేశారు. నోరు తెరిస్తే బూతులు మాట్లాడుతుంటాడని.. ఎంత బూతులు మాట్లాడితే అంత పెద్ద నాయకులు అవుతారని అనుకుంటున్నారని చంద్రబాబు అన్నారు. తన వద్ద రాజకీయ ఓనమాలు నేర్చుకొని.. నాకే పాఠాలు చెప్తారా? చూపిస్తా అంటూ చంద్రబాబు మాట్లాడారు.

## నర్సంపేటలో దొంగల దోపిడీ

వరంగల్, జనవరి 18 (సమ సమాజం): వరంగల్ జిల్లా లో దొంగలు బీభత్సం సృష్టించారు. బుధవారం రాత్రి నర్సంపేట పట్టణంలోని ఓంసాయి నగర్‌లో గల ఓ ఇంట్లో ఎవరూ లేని సమయంలో చొరబడి సుమారు రూ.7.80 లక్షల నగదును అపహరించుకుపోయారు. పొద్దున లేచి చూసేసరికి నగదు మాయమవడంతో బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. దొంగలను త్వరలో పట్టుకుంటామన్నారు. అలాగే ఎవరైనా ఊరిళితే పోలీసులకు సమాచారం అందించాలన్నారు.

## పాలమూరు రెండుసీట్లపై పార్టీల గురి

**రెండింటా గెలుపుకోసం బిఆర్ఎస్ దృష్టి**

**ఉమ్మడి జిల్లాపై పట్టుబిగించిన సిఎం రేవంత్**

మహబూబ్‌నగర్, జనవరి 18 (సమ సమాజం): తెలంగాణలోని అన్ని పార్టీలు పార్లమెంట్ ఎన్నికలపై ఫోకస్ పెట్టాయి. ఉమ్మడి పాలమూరు జిల్లాలోని రెండు స్థానాలకు అభ్యర్థుల ఎంపికపై కసరత్తు చేస్తున్నాయి. సిఎం రేవంత్ రెడ్డికి ఓ రకంగా ఉమ్మడి పాలమూరు జిల్లా సొంతం కావడంతో ఆయన ఇక్కడి రెండు స్థానాలపై దృష్టి సారించారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా ఇక్కడ గెలవడం కోసం స్కెచ్చ వేసినట్లు సమాచారం. అధికారంలో ఉండడం వల్ల గతంలో బీఆర్ఎస్ పార్టీ రెండు స్థానాలు గెల్చుకుంది. ఇప్పుడు అలాంటి పరిస్థితి లేదు. అధికారం లేకపోవడంతో పాటు, వారి అవినీతి కూడా బద్దలవుతున్న కారణంగా వారిని నమ్మి ప్రజలు ఓటేసే పరిస్థితి లేదు. ఇది గమనించి బిఆర్ఎస్ సిట్టింగులకు మళ్లీ సీటు ఇస్తుందా లేక కొత్త వారికి అవకాశం ఇస్తుందా అన్న సస్పెన్స్ కొనసాగుతోంది. అసెంబ్లీ ఎన్నికల ఓటమితో ఉమ్మడి పాలమూరు బీఆర్ఎస్ శ్రేణులు పార్లమెంట్ ఎన్నికల విషయంలో ఉత్సాహం తగ్గింది. ప్రతిష్టాత్మకంగా తీసుకుని పోరాడాల్సి పరిస్థితి వచ్చింది. అసెంబ్లీ ఎన్నికల్లో 14 స్థానాల్లో గులాబీ పార్టీ గెలిచింది కేవలం రెండు సీట్లు మాత్రమే. అందులో మహబూబ్‌నగర్ పార్లమెంట్ నియోజకవర్గంలో అయితే ఒక్క అసెంబ్లీ సీటు కూడా గెలుచుకోలేదు.

Edited, Printed, Published & owned by *GOSUKONDA PRUDHVIRAJU*, Published From, Flot n.o. 6 W.P, Sriramanuja nagar colony, Munganoor, Abdullapurmet, Rangareddy- 501511, TELANGANA, Printed at *Panidhar PUBLICATIONS.* Flot n.o. 6 W.P, Sriramanuja nagar colony, Munganoor, Abdullapurmet, Rangareddy- 501511, ***Editor: GOSUKONDA PRUDHVIRAJU***,
RNI.TELTEL/2016/ 73311, Cell:8464816456 Email: samasamajamdaily@gmail.com, Website: www.samasamajam.in